www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
22.07.2024
సంపుటి:2 సంచిక:278

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

- ఖర్గే, కేసీ వేణుగోపాల్ తో భేటీ
- రాహుల్ గాంధీకి ఆహ్వానం
- మంత్రివర్గ విస్తరణపై మరోసారి చర్చ
- మరోసారి కేంద్రమంత్రులను కలవనున్న రేవంత్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. రెండు రోజులపాటు సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన కొనసాగనుంది. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. నేటి సాయంత్రం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు కేసీ వేణుగోపాల్ లతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నట్లు సమాచారం. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, హామీల అమలు జరుగుతున్న తీరుపై వివరించనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీ రైతు రుణమాఫీ అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జులై 18న రూ.1 లక్ష లోపు రుణాలు ఉన్న అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఎలక్షన్ టైంలో రాహుల్ గాంధీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీని అమలుచేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడాన్ని పురస్కరించుకుని భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు. వరంగల్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. రుణమాఫీ అమలుకు సంబంధించిన కార్యక్రమానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించడంలో భాగంగా ఢిల్లీకి వెళ్లినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. పార్లమెంటు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు దాదాపు ఒకేసారి జరగనున్నాయి. కనుక రాహుల్ గాంధీతో చర్చించి సభ తేదీని నిర్ణయించనున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి మంత్రివర్గ విస్తరణ అంశంపై చర్చ జరుగుతోంది. గతంలో రేవంత్ ఢిల్లీనప్పుడు తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని

..మిగతా 2 లో



**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**
లష్కర్ బోనాలతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం సందడిగా మారింది. తెల్లవారుజాము నుంచే తరలివస్తున్న భక్తులతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మక వాతావరణం వెల్లివిరుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు



## ఉగ్ర గోదావరి

- భద్రాచలం వద్ద 43 అడుగులకు నీటిమట్టం
- లోతొట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు
- భద్రాచలం స్నాన ఘట్టాల వద్ద పెరుగుతున్న నీటి మట్టం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
భద్రాచలం పట్టణంలోని కొత్త కాలనీ, సుభాష్ నగర్ కాలనీలలోకి గోదావరి వరద నీరు ముందుగా వచ్చే అవకాశం ఉండడంతో.. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. పట్టణంలో 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాలలో తలదాచుకునే ప్రజలకు అన్ని వసతులు ఏర్పాటు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలతో పాటు.. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మరింతగా వరద పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ఇంకా పెరిగి.. గోదావరి నీటి మట్టం 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే.. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం చర్ల మండలాలతో పాటు అటు ఆంధ్రప్రదేశ్ కూనవరం చింతూరు వి.అర్.పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు జలాశయానికి ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో.. ఈరోజు మొత్తంగా 5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

> తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షా లకు గోదావరికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో.. గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం దగ్గర గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేడంతో.. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దీంతో.. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భద్రాచలం స్నానఘట్టాల దగ్గర వరద నీరు క్రమక్రమంగా పెరుగుతోంది. కరకట్ట స్లూయిజ్‌ల దగ్గర పరిస్థితిని పరిశీలించి పట్టణ బ్యాక్ వాటర్‌తో పాటు గోదావరి వరద నీరు స్లూయిజ్‌ల ద్వారా లీకేజీ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



## కర్ణాటకను కించపర్చలేదు

- భారతీయ భాషల పట్ల తన గౌరవం
- ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ భేషరతు క్షమాపణ

**విశాలభారతి,వెబ్ డెస్క్ :**ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనలో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాబ్ కోటా బిల్లుపై ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ ఫోన్‌పే ఫౌండర్, సీఈఓ సమీర్ నిగమ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. దీంతో ఆయన స్పందించారు. భేషరతుగా కర్ణాటక వాసులకు క్షమాపణ చెబుతున్నట్లు ఆదివారం తెలిపారు. తనకు ఏనాడూ

..మిగతా 2 లో



## వారంతా ఔరంగ జేబు ఫ్యాన్స్

- ఓడిపోయినా రాహుల్ అహంకారం ప్రదర్శిస్తున్నారు
- శరద్ పవార్ అవినీతిని సంస్థాగతీకరించారు
- కేంద్రహోంమంత్రి అమిత్ షా

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'మహా వికాస్ అఘాడీ' నేతలపై విమర్శలు గుప్పించారు. ఎన్సీపీ నేత శరద్ పవార్‌తో పాటు శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రేలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం మహారాష్ట్రలో పర్యటించిన ఆయన శరద్ పవార్‌ని దేశంలో అవినీతి నాయకుడిగా అభివర్ణించారు. పూణేలో జరిగిన బీజేపీ రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో

..మిగతా 2 లో

## రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలి

- జిల్లాకు నవోదయ విద్యాలయాలు ఇవ్వాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కేంద్ర ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించడమే కాకుండా ఖాజీపేట్ రైల్వేకోచ్ ప్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలు మంజూరు చేయాలి.
మోదీ మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలపై గత పదేళ్ల కాలంలో దృష్టి పెట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈసారి తెలుగుదేశం పార్టీపై ఆధారపడి మోదీ కేంద్ర ప్రభుత్వం నడపాల్సి వస్తుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొస్తాతీరంలో రూ వేల కోట్లతో పెట్రో కెమికల్ ప్రాజెక్టుకు



క్లియరెన్స్ వచ్చినట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎం

..మిగతా 2 లో



## మా ప్రాజెక్టులను కేంద్ర బడ్జెట్‌లో ఆమోదించాలి

**- తమిళనాడు సీఎం స్టాలిన్**

**విశాలభారతి,వెబ్ డెస్క్ :**తమిళనాడు ప్రాజెక్టులను కేంద్ర బడ్జెట్‌లో ఆమోదించాలని సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. 202425 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర నిర్దిష్ట ప్రాజెక్టులను క్లియర్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గత మూడేళ్లుగా చెన్నై మెట్రో రైలు (ఫేజ్ 2) ప్రాజెక్ట్‌కు కేంద్రం నిధులు విడుదల చేయలేదని స్టాలిన్ ఆరోపించారు. తాంబరంచెంగల్పట్టు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే కారిడార్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. కాగా,

..మిగతా 2 లో

## ఉత్తమ్ కు ప్రాజెక్టులపై కనీస అవగాహన ఉందా?



- ఎత్తిపోతల పథకంలో కరెంట్ ఖర్చు కాకుండా ఉంటుందా?
- కాళేశ్వరం లేకపోతే తెలంగాణ ఎప్పటికీ కరువు నేలగానే ఉండేది
- మాజీ మంత్రి హరీష్ రావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
రాజకీయ విమర్శలు కట్టిపెట్టి ప్రాజెక్టులను పునర్ వినియోగంలోకి తీసుకు రావడం పట్ల శ్రద్ధ పెట్టాలని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి అయి అన్ని పంపులు పని చేస్తే ఏడాదికి కరెంట్ చార్జిలే 10 వేల కోట్లు ఖర్చు. వడ్డీకి 15 వేల కోట్లు, విద్యుత్ చార్జీలకు 10 వేల కోట్లు ఖర్చు అని అవగాహనారాహిత్యంతో ఉత్తమ్ ఆరోపించారు. ఎత్తిపోతల పథకాలలో కరెంటు ఖర్చు కాకుండా నీటి సరఫరా ఎట్లా చేస్తారో చెప్పాలని ఉత్తమ్ ను ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో మీ హయాంలో జలయజ్ఞంలో ప్రారంభించిన ప్రాణహితచేవెళ్ళ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ , దేవాదుల, రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ , అలీసాగర్, గత్పా , చౌటుపల్లి, ఎల్లంపల్లి, గూడెం, చిన్న కాళేశ్వరం, మంథని తదితర ప్రాజెక్టులన్నీ ఎత్తిపోతల

..మిగతా 2 లో



## శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**కుటుంబ సభ్యుల ఆందోళన**

**ఎల్బీనగర్, విశాలభారతి :** శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం వేధింపులు భరించలేక ఓ ఇంటర్ చదివే విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన

..మిగతా 2 లో



## అప్పడే పుట్టిన బిడ్డకు 32 పండ్లు

- షాక్ కు గురైన తల్లిదండ్రులు..

# ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ప్రచారం, ఆఖర్లో అదేమీ లేదని తేలిపోయేది. సీఎం రేవంత్ తాజా ఢిల్లీ పర్యటన సైతం రాష్ట్ర కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులపై ఏఐసీసీ పెద్దల్ని సంప్రదించి చర్చలు జరిపే అవకాశం ఉందని వినిపిస్తోంది. పనిలోపనిగా పార్టీ పనులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన నిధులు, అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రులను కలిసి సహకారం కోరనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**ఈ 25న అసెంబ్లీలో బడ్జెట్**

ఈ నెల 23వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆరోజు ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం కానుంది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ జారీ చేశారు. తొలిరోజు కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే (బీఆర్ఎస్) లాస్య నందితకు సంతాపం తెలపనున్నారు. జులై 25వ తేదీన తెలంగాణ ప్రభుత్వం 2024 25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, హామీల అమలు, రుణ మాఫీ, ఇతర పథకాలకు నిధులు సమకూర్చేలా బడ్జెట్ రూపొందించనున్నారు. దాదాపు మూడు లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల ఏడాది కనుక ఏప్రిల్ నుంచి జూలై వరకు ప్రవేశపెట్టిన 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్ గడువు ఈ నెలతో ముగియనుంది. దాంతో ఆగస్టు నుంచి ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేవరకు స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. దీనిపై డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శాఖలవారీగా బడ్జెట్ ప్రతిపాదనలు సేకరించి సమీక్షించారు. హామీల అమలు కోసం అవసరమయ్యే నిధులను దృష్టిలో ఉంచుకుని భారీ బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఛాన్స్ ఉంది.

# వారంతా ఔరంగ జేబు ఫ్యాన్స్

మొదటిపేజీ తరువాయి

ఓడిపోయినా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. 1993 ముంబై వరస పేలుళ్ల దోషి యాకుమ్ మెమన్‌కి క్షమాభిక్ష విషయంలో ఉద్ధవ్ ఠాక్రేని "ఔరంగజేబ్ ఫ్యాన్స్ క్లబ్" అధినేత అంటూ విమర్శించారు.

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాయుతి' కూటమి మెరుగ్గా రాణిస్తుందని చెప్పారు. శరద్ పవార్ అవినీతిని సంస్థాగతీకరించారని దుయ్యబట్టారు. ఇటీవల ఎన్నికల్లో భారత ప్రజలు ప్రధాని నరేంద్రమోడీకి ఆమోద ముద్ర వేశారని, రాబోయే జార్ఖండ్, మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాహుల్ గాంధీ అహంకారాన్ని అణిచివేస్తామని అమిత్ షా అన్నారు. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేని తీవ్రంగా విమర్శిస్తూ.. "1993 ముంబై వరుస పేలుళ్ల దోషి యాకూబ్ మెమన్‌కు క్షమాభిక్ష కోరిన వారితో ఉద్ధవ్ ఠాక్రే కూర్చున్నాడు" అని అన్నారు. ఔరంగజేబు అభిమానుల సంఘం ఎవరంటే.. (26/11 ఉగ్రదాడి దోషి) కసబ్‌కు బిర్యానీ వడ్డించే వారు, యాకూబ్ మెమన్ కోసం క్షమాపణ కోరేవారు, (వివాదాస్పద ఇస్లామిక్ బోధకుడు) జకీర్ నాయక్‌కు శాంతి దూతగా చెబుతూ మద్దతు ఇచ్చే వారని అన్నారు. అలాంటి వ్యక్తులతో ఠాక్రే పొత్తు పెట్టుకోవడానికి సిగ్గుపడాలని అని ఘాటుగా విమర్శించారు. బీజేపీ నాయకులు, శ్రేణులను ఉద్దేశిస్తూ మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూసి భయపడొద్దని, కార్యకర్తలు మంచిగా పనిచేయడం ద్వారా మళ్లీ పుంజుకోవచ్చని అన్నారు. మహారాష్ట్రలో ప్రతీ బీజేపీ కార్యకర్త విజయం కోసం కృషి చేయాలని అన్నారు. మహారాష్ట్రలో మళ్లీ కమలం వికసించాలని చెప్పారు. 2014, 2019 ఎన్నికలతో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలను కనబరుస్తామని చెప్పారు.



# కర్ణాటకను కించపర్చలేదు



మొదటిపేజీ తరువాయి

కర్ణాటకను కించపర్చాలన్న ఆలోచన, ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. సమీర్ నిగమ్ వ్యాఖ్యల నేపథ్యంలో ఫోన్‌పేను బహిష్కరించాలని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తడంతో ఆయన దిగి వచ్చారు. కర్ణాటక రాజధాని బెంగళూరు కేంద్రంగా ఫోన్‌పే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సమీర్ నిగం వ్యాఖ్యలు కర్ణాటక రాష్ట్రాన్ని, కన్నడిగులను కించపర్చడమేనని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. దీంతో సమీర్ నిగం వ్యక్తిగత ప్రకటన చేస్తూ తనకు కర్ణాటక అంటే గౌరవం ఉందని, తనకు ఏ ఒక్కరినీ కించపర్చాలన్న ఉద్దేశం లేదని క్లారిఫికేషన్ ఇచ్చారు. 'కర్ణాటకలోనే ఫోన్‌పే పుట్టింది. ఈ నగరంతో మా మూలాలు ఇమిడి ఉన్నందుకు మేం గర్విస్తున్నాం. వైవిధ్యభరితమైన అసాధారణ సాంకేతిక పరిజ్ఞానానికి పెట్టింది పేరు బెంగళూరు' అని సమీర్ నిగమ్ పేర్కొన్నారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరికైనా బాధ కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. కన్నడంతోపాటు భారతీయ భాషల పట్ల తన గౌరవం ఉందని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం జాబ్ కోటా బిల్లును కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ ను పెట్టింది.



# శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి

సంఘటన శనివారం రాత్రి చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం చేదురు బావి తండాకు చెందిన హరీష్ తన కూతురు ఆర్ కె పురం డివిజన్ హరిపురి కాలనీలోని శ్రీ చైతన్య కళాశాల కెకె బాలికల క్యాంపస్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 440 మార్కులకుగాను 432 మార్కులు సాధించింది. గత కొన్ని రోజులుగా మానసిక వేదనకు గురవుతుంది. ఈ క్రమంలో శనివారం హాస్టల్ గదిలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే తోటి స్నేహితులు గమనించి ప్రిన్సిపాల్ కు తెలిపారు. వెంటనే విద్యార్థిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేశారు.

**కుటుంబ సభ్యుల ఆందోళన..**

కళాశాల ప్రిన్సిపాల్ వేధింపులకు తట్టుకోలేక తన కూతురు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. శనివారం మధ్యాహ్నం జరిగిన సంఘటనకు కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.







# కష్టం అంటే గుర్తుకొచ్చే వ్యక్తి పసుపులేటి

- కులం మతం తేడా లేకోకుండా సేవలు
- పసుపులేటి వినోద్

**కడప, విశాలభారతి:** పసుపులేటి వినోద్ గత ఐదు సంవత్సరాల నుండి కులం మతం తేడా లేకోకుండా ఎందరికో నిరుపేద కుటుంబలకి ఒక్క భరోసాగా ఇస్తున్నారు. అయితే ఏమి ఒక సాధారణ కుటుంబంలో పుట్టి ఒక చిన్న ఉద్యగం చేస్తూ అతనికి వచ్చిన జీతంలో నిరుపేద ప్రజలకి నిత్యవసర సరుకులు, మెడిసిన్స్, ఏమి అభాగ్యులకి ఆశ్రమాలలో అన్నదానాలు, రోడ్డు మీద ఉన్న అనాధలకి అభాగ్యులకి ఒక ఇంటి పెద్ద కొడుకుగా పేద ప్రజలకి ఒక భరోసా గాని అన్ని విధాలుగా తాను చూసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అతని దగ్గరికి ఎవరు ఏ సహాయం వచ్చినా కాదనకుండా అతనికి తగిన విధంగా సహాయం చేస్తూ పేద ప్రజల్లో ఒక గొప్ప మనసును చాటు చేసుకున్నాడు. ఇలాంటి గొప్ప మనసున్న మహనీయుడు ప్రజల్లో ఒక స్థానం అనేది ఏర్పరచుకున్నాడని, ఆంధ్రప్రదేశ్ ఏ జిల్లాలో ఏ సహాయం కావాలన్నా నేనున్నానంటూ ముందుకు వచ్చి మన బాధలను తీరుస్తున్నాడు. అక్కున చేర్చుకుని ఆనందాన్ని పంచుతున్న పసుపులేటి వినోద్ కడప జిల్లా ప్రజల్లో నిరాధారణకు గురైన వారందరికీ ఆశా దీపం చిమ్మ చీకట్లో నైనా చిందింపచేయు చిరు దరహాసం ఆదరణకు నోచుకోని ప్రతి ఒక్కరికి అందిస్తున్నారు. సహ నివాసం గత ఐదు సంవత్సరాల నుండి నిరాదరణకు గురైన పుట్టిన బిడ్డ దగ్గర నుంచి కాటికి కాళ్లు చాచిన వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకుంటూ ఆనందాన్ని పంచుతున్నాడు మన పసుపులేటి వినోద్ నిరాదారణకు గురైన పిల్లలకు వీరందరికీ సేవ చేసే భాగ్యం కల్పించిన ఆ భగవంతుడికి నమస్కారాలు తెలియజేస్తూ ఇటువంటి వారు ఇంకా మరికొందరిని చూడాలని మానవ సేవయే మాధవసేవగా గుర్తించి సొంత లాభం కొంత మానుకొని తోటి వారికి తోడ్పడవోయే అనుసూక్తిని పాటిస్తూ అనుసూక్తిని పాటిస్తూ మానవత విలువలు మంట కలిసిపోతున్న ఈ రోజుల్లో కన్నవారిని ఉన్నవారిని గాలికి వదిలేసిన ఈ ప్రస్తుత సమాజంలో మానవత్వం పరిమిలింప చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు

# భారీ వర్షాలతో జిల్లా అతలాకుతలం

- జిల్లాలో దంచి కొడుతున్న వానలు
- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రంగంలోకి రెస్క్యూటీమ్ లు

**భద్రాద్రి కొత్తగూడెం, విశాలభారతి :** జిల్లాలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అతలాకుతలమయింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో దిగువన భద్రాచలం గోదావరి గంట గంటకు పెరుగుతోంది. భారీ వర్షాలతో చెరువులు కుంటలు అలుగు పోస్తున్నాయి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టులోకి వరద కొనసాగుతుండడంతో 25 గేట్లు ఎత్తిన అధికారులు 8,85,224 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆదివారం నాడు సాయంత్రం ఏడు గంటలకు భద్రాచలం లో గోదావరి 43 అడుగులకు చేరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఓపెన్ కాస్ట్ లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ పలు శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. మూడు జిల్లాల్లో గోదావరి పెరుగుతుండడంతో భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఆఫీసర్లు హై అలర్ట్ ప్రకటించారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఎన్డీఆర్ఎఫ్ టీములు, రిస్క్యూ బృందాలను రంగంలోకి దింపారు. భూపాలపల్లి, భద్రాద్రి జిల్లాలో మూడు చొప్పున స్పీడ్ బోట్లను సిద్ధంగా ఉంచారు . ఒక్కో జిల్లాలో మూడు రెస్క్యూ బృందాలు పనిచేస్తున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వరదల వలన ప్రాణ నష్టం జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకున్నట్లుగా ప్రకటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పినపాక, కరకగూడెం మండలాలలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో వరి పంటకు సిద్ధం చేసిన నారు మడులు, మొక్క దశలో ఉన్న పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. మణుగూరులో కోడిపుంజుల వాగు ఉదృతంగా ప్రవహిస్తోంది. పినపాక మండలంలో చేపల వేటకు వెళ్లిన పాయం నగేష్ అనే యువకుడు గల్లంతయ్యాడు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విట్టల్ రావు నగర్ లో శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో రేకుల షెడ్డు కూలిపోయింది. గోగుల జయలక్ష్మి ఆమె కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఆ సమయంలో సింగరేణి కార్మికుడు మందా కోటేశ్వరరావు గమనించి సంఘటన స్థలానికి చేరుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని కాపాడారు. ఆదివారం ఉదయం పలు సంఘాలు స్పందించి నగదు రూపంలో సహాయం అందించి వారి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# వరంగల్‌కు చేరిన "వాల్యూ గోల్డ్"






- తెలంగాణలోనే తొలి మొబైల్ గోల్డ్ కొనుగోలు కేంద్రం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్న వాల్యూ గోల్డ్ వాహనం
- అందుబాటులోకి తెచ్చిన ప్రముఖ జువెల్లరీ సంస్థ క్యాప్స్ గోల్డ్

**విశాలభారతి, వరంగల్:** ప్రముఖ జువెల్లరీ, బులియన్ వ్యాపార సంస్థ క్యాప్స్ గోల్డ్ అనుబంధ సంస్థ అయిన వాల్యూ గోల్డ్ గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరిస్తోంది. తెలంగాణలోనే తొలి మొబైల్ గోల్డ్ కొనుగోలు సేవలను ప్రారంభించగా... గ్రామీణ తెలంగాణకు సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇటీవలే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు గ్రామాలు, పట్టణాల మీదుగా సాగిన వాల్యూ గోల్డ్ మొబైల్ కేంద్రం సేవలు... తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరుకున్నాయి. ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. నేటి నుంచి ఈ నెలాఖరు వరకు వరంగల్‌లోని కేఆర్ గార్డెన్ వద్ద, ఆగస్టు ఒకటి నుంచి 6 వరకు మహబూబాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద మొబైల్ కొనుగోలు కేంద్రం వద్ద లావాదేవీలను నిర్వహించనున్నారు. తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ఈ తరహా మొబైల్ గోల్డ్ కొనుగోలు సేవలను క్యాప్స్ గోల్డ్ వినియోగంలోకి తీసుకురాగా... ఇటీవల కరీంనగర్ జిల్లాలో సాగిన పర్యటనకు అనూహ్య స్పందన వచ్చింది. ఓవైపు నగరంలో ఉప్పల్, కూకట్‌పల్లి, బంజారాహిల్స్, సికింద్రాబాద్, చింతల్ ప్రాంతాల్లో శాఖలను ఏర్పాటు చేసి బులియన్ సేవలు అందిస్తోంది. అన్ని శాఖలలో రిటైల్ కొనుగోళ్లకు వీలుగా బంగారం, వెండి నాణేలను ప్రవేశపెట్టింది. ఇక గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించాలనే లక్ష్యంతో వాల్యూ గోల్డ్ మొబైల్ కొనుగోలు సెంటర్లతో జిల్లాల పర్యటన మొదలుపెట్టామని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ వాల్యూ గోల్డ్ టూర్ ఉంటుందని సీఈఓ భరద్వాజ్ పంపత్వార్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ బంగారు మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, సులభమైన విధానాలను అమలులోకి తీసుకురావడమే తమ ఉద్దేశమన్నారు. తెలంగాణలోనే తొలిసారిగా మొబైల్ బంగారం కొనుగోలు సేవలను గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.

**సందడి చేసిన మై విలేజ్ షో ఫేం...**

ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన వాల్యూ గోల్డ్ మొబైల్ సెంటర్ రోడ్ షోను ప్రముఖ యూట్యూబర్లు మై విలేజ్ షో ఫేం గంగవ్వ, అనిల్ గీలా ప్రారంభించారు. నగరంలో పర్యటించిన వాల్యూ గోల్డ్ నిర్వహకులతో కలిసి మొబైల్ గోల్డ్ కొనుగోలు కేంద్రం వద్ద సందడి చేశారు. ఊరురా తిరిగే మొబైల్ సెంటర్ ద్వారా ఇంటి వద్దనే వాల్యూ గోల్డ్ సేవలను పొందవచ్చని తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఉచితంగా స్వచ్ఛత పరీక్షలు...**

వాల్యూ గోల్డ్ షోరూంలో వినియోగదారులకు అందుతున్న సేవలకు తగినట్లుగా బంగారాన్ని అమ్ముకోవడాన్ని అతి సులభంగా చేసి, తక్షణమే డబ్బులు అందించేలా ఈ మొబైల్ సెంటర్ ద్వారా అందిస్తోంది. వినియోగదారుల వద్ద బంగారు నగలకు ఉచితంగా స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దీంతోపాటు అత్యవసరమైన బంగారాన్ని విక్రయించాలనుకుంటే, మొబైల్ సెంటర్ వద్దనే నాణ్యత పరీక్షలు నిర్వహించి, ఆ రోజున బులియన్ మార్కెట్ ధరతో కొనుగోలు చేసి, తక్షణమే డబ్బు పొందవచ్చన్నారు. అదేవిధంగా తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిచి, మార్కెట్ ధరకు కొనుగోలు చేస్తామన్నారు. మానవ ప్రమేయం లేకుండా ఆధునాతన మెషనరీ సాయంతో నాణ్యత పరీక్షలు నిర్వహించి బంగారం క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలనే లక్ష్యంతో సేవలను అందిస్తున్నామన్నారు. వాల్యూ గోల్డ్ మొబైల్ సెంటర్ల వద్దనే 24 క్యారెట్ల బంగారు నాణేలు, వెండి నాణేలను ఒక్క గ్రాము నుంచి 20 గ్రాముల వరకు అన్ని ఆకృతుల్లో విక్రయిస్తామని తెలిపారు.

# అప్పుడే పుట్టిన బిడ్డకు 32 పండ్లు

- షాక్ కు గురైన తల్లిదండ్రులు
- చిన్నారికి పుట్టుకతో పళ్లు రావడంతో తల్లిదండ్రుల షాక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అప్పుడే పుట్టిన నవజాత శిశువులు కళ్లు తెరుస్తూ, తల్లి పాల కోసం ఎదురుచూస్తుంటారు. రోజులు గడుస్తున్నకొద్ది వారి శరీర అవయవాలు పెరుగుతుంటాయి. మెల్లిమెల్లిగా దంతాలు వస్తుంటాయి. కానీ ఓ చిన్నారి విషయంలో మాత్రం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. పుట్టినప్పుడు ఆ శిశువుకు నోటినిండా 32 పళ్లు వచ్చాయి. ఇది చూసిన తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఆ చిన్నారికి పుట్టుకతోనే పళ్లు రావడంపై తల్లి సోషల్ మీడియాలో ఈ విషయాన్ని షేర్ చేసుకుంది. అవగాహన కోసమే దానిని షేర్ చేసినట్లు పేర్కొన్నారు.



అయితే ఇలా పుట్టుకతోనే పళ్లు వచ్చే పరిస్థితిని 'నాటల్ టీత్' అని అంటారు. ఇలా వస్తే బిడ్డకు అంతగా ప్రమాదం ఉండదు. కానీ పాలిచ్చేటప్పుడు తల్లికి ఇబ్బంది అవుతుంది. ఏదైన పన్ను విరిగిపోతే దాన్ని ఆ చిన్నారి మింగే ఛాన్స్ కూడా ఉంటుంది. ఈ వీడియో చూసిన నెటీజన్లు షాక్ అవుతున్నారు. బిడ్డ ఆరోగ్యం బాగుందా.. పెరిగే కొద్ది ఏదైన సమస్యలు వస్తున్నాయా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. అయితే తర్వాత ఆ పాప పళ్లను వైద్యులు తొలగించినట్లు తెలుస్తోంది.

# రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు నాయుడు కొంత మేరకు నిధుల కేటాయింపులు చేసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రెండు జాతీయ పార్టీల నుంచి బీజేపీ 8, కాంగ్రెస్ 8, ఎంఐఎం 1 పార్లమెంట్ స్థానాలు గెలిచాయి. ఈ నేపథ్యంలో ఆయా ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీలుగా తాము ఉన్నప్పుడు చాలా అంశాలను పార్లమెంట్ లో లేవనెత్తి రాష్ట్రానికి రావాల్సినవి సాధించుకున్నామని పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు గత 15 రోజుల నుంచి కేంద్రానికి ఎలాంటి వినతిపత్రాలు ఇవ్వలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభానికి ఒక రోజు మాత్రమే సమయం ఉంది. బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటెల రాజేందర్, డీకే. అరుణ నేడు, రేపు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్ట్‌ల విషయంలో కేంద్రం పై ఒత్తిడి తేవాలన్నారు.

# మా ప్రాజెక్టులను కేంద్ర బడ్జెట్‌లో ఆమోదించాలి

మొదటిపేజీ తరువాయి

కేంద్ర బడ్జెట్‌పై తమిళ ప్రజల అంచనాలను సీఎం ఎంకే స్టాలిన్ హైలైట్ చేశారు. కోయంబత్తూరు, మదురైలో మెట్రో రైలు ప్రాజెక్టులకు ఆమోదం, తమిళనాడులో ఇప్పటికే ప్రకటించిన రైల్వే ప్రాజెక్టులకు తగిన నిధుల కేటాయింపు, పీఎం ఆవాస్ అర్బన్, గ్రామీణ గృహ పథకాల వ్యయ పరిమితిని పెంచాలని కేంద్రాన్ని కోరారు.

మరోవైపు సుమారు పదేళ్లుగా ఆదాయపు పన్ను భారం తగ్గుతాయని, తమకు పన్ను రాయితీలు లభిస్తాయని మధ్య తరగతి కుటుంబాలు ఆశిస్తున్నాయని సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. తమిళనాడు ప్రజల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని తాను నమ్ముతున్నానని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.





# గోకుల్ ప్లాట్స్ లో బొబ్ టాకీస్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్

**కూకట్ పల్లి,విశాలభారతి:** కూకట్పల్లి కెపిహెచ్బి కాలనీ గోకుల్ ప్లాట్ చౌరస్తాలో బొబ్ టాకీస్ ప్రైవేట్ పార్టీ థియేటర్ ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్యఅతిథిగా వచ్చి ప్రైవేట్ పార్టీ మాల్ ను ఆయన ప్రారంభింbచారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల పై ఆధార పడకుండా స్వయం ఉపాధి లపై దృష్టిసారించాలన్నారు. మనం పెట్టే వ్యాపారం నలుగురికి ఉపయోగపడే విధంగా ఉండాలని, తద్వారా మనమే కాక, మనతో పాటు నలుగురికి ఉపాధి కల్పించిన వారవుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పార్టీ థియేటర్ మాల్ యాజమాన్యంకి అభినందనలు తెలిపారు. శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, శేరి సతీష్ రెడ్డి, దిండి అరవింద్ రెడ్డి, తన్నీరు ప్రసాద్, మేకల మైఖేల్, లుంగీ రాజు, రాజు ముదిరాజ్, చిటకూరు కృష్ణ,రాజు దగ్గుడు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి దామోదర రాజనర్సింహ పెళ్లి రోజు..

# శుభాకాంక్షలు తెలిపిన 'కాట' దంపతులు

**పటాన్ చెరు,విశాలభారతి:**తన రాజకీయ గురువు, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమం, శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మంత్రి దామోదర రాజనర్సింహ తన వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్ తన సతీమణి, మహిళా కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాట సుధాతో కలిసి మంత్రి దామోదరకు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ దంపతులకు పుష్ప గుచ్ఛం అందించి, పూలమాలలతో వారు ఘనంగా సన్మానించారు.




# దేవరుప్పులకు నూతన ఎస్సైగా సృజన్ కుమార్

**దేవరుప్పుల విశాలభారతి:**దేవరుప్పుల మండల నూతన ఎస్సై గా సృజన్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు.సాధారణ బదిలీలో భాగంగా గతంలో ఇక్కడ పని చేసిన చెన్నకేశవులు జనగామకు బదిలీపై వెళ్లగా జనగాంలో విధులు నిర్వహిస్తున్న సృజన్ కుమార్ దేవరుప్పుల కు వచ్చారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్తమ్ కు ప్రాజెక్టులపై కనీస అవగాహన ఉందా?

మొదటిపేజీ తరువాయి

పథకాలే. వీటికి కరెంటు ఖర్చు లేకుండానే నీటి సరఫరా చేద్దామని ఉత్తం అనుకున్నారా. ఎత్తిపోతల పథకాలకు కరెంటు ఖర్చు తప్పనిసరి. కరెంటు ఖర్చులు ఉంటాయని ఎత్తిపోతలు నిర్మించకపోతే తెలంగాణ ఎప్పటికీ కరువు ప్రాంతంగా, వలసల ప్రాంతంగా, రైతుల ఆత్మ హత్యలకు నిలయంగా మారిపోతుంది. తెలంగాణ భౌగోళిక పరిస్థితి అది. ఉత్తం కొంచెం సోయితో మాట్లాడాలి. కనీసం ఢిల్లీలో మాట్లాడేటప్పుడు తెలంగాణ పరువు తీయవద్దని సెటైర్లు వేశారు. 2022 లో సంభవించిన వరద గోదావరి చరిత్రలోనే అతి పెద్దది. మేడిగడ్డ బ్యారేజి వద్ద 28 లక్షల క్యూసెక్కులకు పైబడి వరద ప్రవాహం నమోదు అయ్యింది. బ్యారేజి కింద సిమెంట్ బ్లాకులు అక్కడక్కడ లేచిపోయి ఉన్నందున చిన్నలీకేజీలు బుంగలుగా మారి రాఫ్ట్ కింద సొరంగం ఏర్పడడానికి దోహదం చేసింది. బ్లాక్ 7 లో రాఫ్ట్ కింద ఏర్పడిన ఈ సొరంగం 2023 లో సంభవించిన భారీ వరదల అనంతరం అక్టోబర్ చివరి వారంలో మూడు పిల్లర్ల కుంగుబాటుకు కారణమన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు పై జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సమావేశం ముగిసిన అనంతరం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో ప్రెస్ మీట్ నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాకులు చెవాకులు పేలి, తన అవగాహనా రాహిత్యాన్ని బయటపెట్టుకున్నారు. ఒకవైపు మేడిగడ్డ పునాదిని బలపరిచేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం అని అంటూనే మేడిగడ్డ వద్ద మట్టి పరీక్షలు సాధ్యపడలేదు అని అంటున్నారని ఎద్దేవా చేశారు.

**వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

ఈ ఏడాది మే 5న ఒక నివేదిక ఇచ్చిన NDSA, వర్షాకాలం వరదలు రాకముందే.. జులై మొదటి వారం లోపే పలు సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని నివేదికలో పేర్కొన్నది. NDSA సూచనలతో.. జూన్ రెండో వారంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు CWPRS, CSMRS లతో సాంకేతిక పరీక్షలు చేయించాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం రెండు సంస్థలు సాంకేతిక పరీక్షలకు ఉపక్రమించే సమయానికి వరద రావడంతో టెస్ట్ లు ఆపివేసినట్టు ఉత్తమ్ పేర్కొనడం గమనార్హం. ఈ వైఫల్యానికి NDSA నిర్లక్ష్య వైఖరి కారణమైతే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వైఫల్యానికి బాధ్యత వహించాలి' అన్నారు హరీష్ రావు.

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ 2023 అక్టోబర్ నివేదిక పై ఆనాడే విమర్శలు వెల్లువెత్తాయి. పరిశీలన జరపకుండానే, ఎటువంటి భూభౌతిక పరీక్షల ఫలితాలు లేకుండానే, తెలంగాణ ఇంజనీర్లతో ఏమీ చర్చకుండానే ఇటువంటి నిర్ధారణలకు రావడం కేంద్ర ప్రభుత్వ అధీనంలో పని చేసే ఒక సాంకేతిక సంస్థ చేయవలసిన పని కాదు. లోపాలు ఉండవచ్చునని ఊహాగానాలతో కేంద్రంలోని పాలక పక్షానికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చడానికి నివేదికను వండి వార్చినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. ఇవన్నీరాసి చివరికి భూభౌతిక పరీక్షలను జరిపి ఆ నివేదికలను తమకు అందజేయాలని ఉచిత సలహా పారేసి నివేదికను ముగించారు. నది గర్భంలో జరిగే మార్పుల కారణంగా ఈ ఘటన జరిగి ఉంటుందని డ్యాం సేఫ్టీ అథారిటీ వారే ఆ నివేదికలో పేర్కొన్నారు. అది దురదృష్టకరమైనదే. ప్రభుత్వం గాని, ఇంజనీర్లు గాని ఎవరూ ఇటువంటి సంఘటన జరగాలని కోరుకోరు.

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ పునరుద్ధరణ చర్యలు సూచిస్తారని ఆశించిన ప్రాజెక్టు ఇంజనీర్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. వారు రెండుసార్లు పర్యటించి పోలీసుల తరహాలో రహస్య విచారణ చేపట్టినప్పుడు వానాకాలంలో వరదల నుంచి మేడిగడ్డ బ్యారేజీని రక్షించడానికి తాత్కాలిక చర్యలు సూచించాలని ఇంజనీర్లు, ప్రభుత్వ పెద్దలు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీని కోరినట్టు పత్రికల్లో వార్తలు వచ్చినాయి. రుతుపవనాల ఆగమనానికి సమయం దగ్గర పడుతున్నా వారు మాత్రం రక్షణ చర్యలు సూచించలేదు. ఆ సంస్థ ఏర్పాటు అయ్యిందే దేశంలో ఉండే డ్యాంలు, బ్యారేజీల సంరక్షణ కోసం. అయితే వీరు మాత్రం అన్ని కేంద్ర సంస్థల మాదిరిగానే కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలను కాపాడే దిశగా పని చేస్తున్నారని వారి ప్రాథమిక నివేదిక, ఆ తర్వాత వారి నిర్లక్ష్య వైఖరి స్పష్టం చేసింది.

ఆ తర్వాత పి సి ఘోష్ విచారణ కమిషన్ ఆదేశాలు జారీ చేసిన తర్వాతనే వారు తాత్కాలిక రక్షణా చర్యలు సూచిస్తూ మె నెలలో నివేదిక పంపినారు. ఇందులో తమకు తెలియని కొత్త పరిష్కార మార్గాలు ఏమీ లేవని, తాము చెప్పిన పరిష్కార మార్గాలే తమకు సూచించినారని, దీని కోసం నాలుగు నెలల విలువైన కాలాన్ని హరించి వేశారని ఇంజనీర్లు వాపోయారు. ఇదీ ఘనమైన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారి నిర్వాకం.

**మేడిగడ్డ బ్యారేజీకి ఏదైనా ప్రమాదం వాటిల్లితే ఆ బాధ్యత ప్రభుత్వానిదే**

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వారు చెప్పినవే పరిష్కారాలు అని ప్రభుత్వం కూడా భావించి రాష్ట్ర ఇంజనీర్లను ముందుకు సాగనివ్వలేదు. గోదావరికి వరదలు రాకముందే బ్యారేజీకి సరైయిన రక్షణ చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వం NDSA నివేదిక కోసం ఎదురుచూస్తూ 4 నెలల విలువైన కాలాన్ని వృథా చేసింది. ఇప్పుడేమో వరదల కారణంగా పరీక్షలు ఆపివేశామని చెప్పడం బాధ్యతా రాహిత్యం కాదా అని హరీష్ రావు ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజి పునరుద్ధరణకు నిర్మాణాత్మక సూచనలు చేయడంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ విఫలమైంది. వారి నుంచి నివేదికను తెప్పించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఈ వరదల్లో మేడిగడ్డ బ్యారేజీకి ఏదైనా ప్రమాదం వాటిల్లితే ఆ బాధ్యత ప్రభుత్వానిదే. వానాకాలం ముగిసే నాటికి NDSA నుంచి శాశ్వత రక్షణ చర్యలకు సంబందించిన నివేదికను తెప్పించుకోవడం పట్ల శ్రద్ధ వహించాలని ఉత్తమ్ ను కోరారు.

తుమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు కడతామని ఉత్తమ్ కుమార్ అన్నారు. మా ప్రభుత్వం గతంలోనే 148 మీటర్ల ఎత్తు వద్ద బ్యారేజి నిర్మించాడానికి మహారాష్ట్రను ఒప్పించాము. మహారాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందంపై సంతకం చేసింది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజి ఏ ఎత్తు వద్ద కడతారు? ఒప్పందం ప్రకారం 148 మీటర్ల వద్దనా ? 152 మీటర్ల వద్దనా ? ఉత్తమ్ స్పష్టం చేయాలి. 152 మీటర్ల వద్ద బ్యారేజి కట్టాలని అనుకుంటే మొదట మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని, ఆ తర్వాతనె బ్యారేజి పనులను ప్రారంభించాలని ఉత్తమ్ ను కోరారు.

కేంద్రంలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్ లో, మహారాష్ట్రాలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏలుతున్న కాలంలోనే 152 మీటర్ల వద్ద బ్యారేజి నిర్మానికి ఒప్పందం చేసుకోలేక పోయి చేతులెత్తేసింది ఎవరు ? మహారాష్ట్రాతో ఒప్పందం చేసుకోలేక తుమ్మిడిహట్టి బ్యారేజి పనులను ప్రారంభించక వదిలేసింది ఎవరు ? ఆ వైఫల్యం మీది కాదా. తలను వదిలేసి తోక నుంచి పనులకు టెండర్లు పిలిచి మొదలుపెట్టి, మొబిలైజేషన్ అడ్వాన్స్ ల పేరు మీద, సర్వే , డిజైన్ల పేరు మీద తట్ట మట్టి ఎత్తక ముందే వందల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించి కమీషన్లు దండుకున్నది మీరు కాదా ?

2013 లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి పృథ్విరాజ్ చవాన్ రాసిన లేఖలోని అంశాలు ఉత్తమ్ మరొక్కసారి చదువుకోవాలని సూచిస్తున్నా. వారు చేసిన సూచనలను దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహట్టి బ్యారేజిపై నిర్ణయం తీసుకోవాలి. గ్రావిటీ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని ఉత్తమ్ ప్రకటించడం ఆయన అవగాహనారాహిత్యాన్ని సూచిస్తున్నది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజి కట్టినా లిఫ్ట్ లేకుండా ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్ళు రావని ఉత్తమ్ కు తెలువకపోయి ఉంటుంది. ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగితే అక్కడ కూడా 40 మీటర్ల లిఫ్ట్ అవసరమని చెపుతారు. తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని ఎల్లంపల్లికి తీసుకు రావచ్చు అన్న అబద్దపు ప్రచారాన్ని సాగునీటి మంత్రిగా పదవి స్వీకరించిన 7 నెలల తర్వాత కూడా నమ్మడం విచిత్రం అని హరీశ్ రావు పేర్కొన్నారు

రీ ఇంజనీరింగ్ తర్వాత కూడా జలాశయాల నిల్వ సామర్థ్యం పెంచడం తప్ప ఎల్లంపల్లి నుంచి పైకి నీటిని తీసుకు వచ్చే అలైన్మెంట్ ఏ మార్పు లేదు. కాబట్టి ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టు అయినా , కాళేశ్వరం ప్రాజెక్టు అయినా రెండూ కూడా మల్టీ స్టేజ్ ఎత్తిపోతల పథకాలే. రెండింటిలో కరెంటు ఖర్చు దాదాపు సమానమే. ఉత్తమ్ ప్రవచించినట్టు కాళేశ్వరం ప్రాజెక్టుల మాత్రమే కరెంటు ఖర్చులు ఎక్కువ , తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో తక్కువ అన్నది తప్పుడు అవగాహన.

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు ఉత్తమ్. అక్కడ పదేళ్ళ కాంగ్రెస్ హయాంలోనే పూర్తి చేసింటే మాకు రీ ఇంజనీరింగ్ చేసే సమస్య తప్పేది. సమస్యల వల్లే బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా 148 మీటర్ల వద్ద ఒప్పందం ఉన్నప్పటికీ బ్యారేజీని నిర్మించలేదు. దానికి ప్రత్యామ్నాయంగా వార్ధా నదిపై బ్యారేజీని ప్రతిపాదించాం. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించి ఆ బ్యారేజి ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు 20 టిఎంసిల సాగునీరు ఇవ్వాలని భావించాము. మిగతా జిల్లాల అవసరాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును రూపకల్పన చేశాం.

# అందరి దృష్టి తెలంగాణ స్పీకర్‌పైనే !

సూర్యుడి చుట్టూ భూమి భ్రమణం చేస్తుందని చెప్పడం ఎంత నిజమో... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ఫిరాయింపుల చుట్టూ భ్రమణం... పరిభ్రమణం చేస్తున్నాయి అంటే కూడా అంతే నిజం. ఎందుకంటే, ప్రతి రోజూ అన్ని వార్తా పత్రికలు ఈ అంశం లేకుండా ప్రచురితం కావడం లేదు. ఇక తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఒక తెలుగు టీవీ ఛానల్కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... "తాను వ్యక్తిగతంగా ఫిరాయింపులకు వ్యతిరేకం" అని వ్యాఖ్యానించిన అంశం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశం అవుతుంది. వాస్తవానికి సభాపతి ప్రసాద్ కుమార్ మృదు స్వభావిగా అగుపిస్తారు. ఆయన హార్యం, ఆహార్యంలో గంభీరత్వం ఉన్నా... నిర్ణయాల్లో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తారన్న పేరు ఉన్నది. ఎందుకంటే, ఆయన వికారాబాద్ ప్రాంతానికి చెందిన కొంశెట్ పల్లి అనే మారుమూల గ్రామం నుంచి ఎంపీటీసీగా విజయం సాధించి... ఎంపీపీగా... ఎమ్మెల్యేగా... మంత్రిగా ఎన్నికై అంచలంచలుగా ఎదిగి ఈరోజు స్పీకర్ అనే రాజ్యాంగ పదవి స్థాయికి దాకా వచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన దళిత నేతగా స్పీకర్ ప్రసాద్ కుమార్కు పేరు ఉన్నది. ఇదే ప్రసాద్ కుమార్ను పట్టుకొని వికారాబాద్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కేటీఆర్ ఒకసారి మాట్లాడుతూ... "ఆ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ గెలిస్తే బీఆర్ఎస్లోకి వస్తా అని అంటుండట. వాడు వచ్చుడు వద్దు మాకు. ఏమి వద్దు." అంటూ జగ్జీవన్రాం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన రోడ్ షోలో తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రసాద్ ఏనాడూ బహిరంగంగా తాను బీఆర్ఎస్ లోకి వెళతానని అని చెప్పలేదు. అలా ఆయన అనని... మాటలను ఉటంకించుకొని కేటీఆర్ ఆనాడు మాట్లాడి... ఈ రోజు అదే వ్యక్తి స్పీకర్ అవడం... ఆయన ముందుకి కేటీఆర్ రిక్వెస్టులు పట్టుకపోవడం చూస్తూంటే విధి ఎంత విచిత్రమైనది అని అనిపిస్తుంది. అందుకే అంటాం. కాలం ఎవ్వరినీ వదిలిపెట్టదు. అందరి సంగతి తెలుతుస్తుంది అని.



ప్రస్తుతం మాత్రం స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను ఆసరా చేసుకొన్న బీఆర్ఎస్ పార్టీ పెద్దలు, ఫిరాయింపులపై పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఇప్పటికే పది మంది వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. అయితే, వారు ఎందుకు కప్పుకుంటున్నారన్న అంశంపై ఆ పార్టీ దృష్టి సారించకపోవడం శోచనీయం. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒక సభలో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో... ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ... తాను పార్టీ మారుతున్నానని స్వయంగా కేటీఆరే అందరికి చెబుతూ దుష్ప్రచారం చేస్తున్నారని వేదిక మీదనే ఆవేదనకి గురయ్యారు. ఒక దళిత ఎమ్మెల్యేను పట్టుకొని... పార్టీ మారుతున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటే అంటే ఆయనకు ఆ పార్టీలో గానీ... నియోజకవర్గంలోని గానీ విలువ ఏం ఉంటుంది? బహుశా, దానికి మనస్థాపానికి గురయ్యే కాలే యాదయ్య సడెన్గా పార్టీ మారినట్టు ఉన్నారని స్థానికంగా వస్తున్న వ్యాఖ్యానాలు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న ఫిరాయింపులపై బీఆర్ఎస్ విమర్శలు చూస్తుంటే... ఇదెప్పుడూ జరగని విషయంగా... అసలు ఎవరికి తెలియని సబ్జెక్టుగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. కానీ, గత పది సంవత్సరాల కాలంలో వారి హయాంలో జరిగిన ఫిరాయింపుల అంశం చెప్పమంటే... నీళ్ళు నములుతున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అప్పుడు ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం 15 మంది సభ్యులున్న టీడీపీ శాసనసభా పక్షం మొత్తాన్ని విలీనం చేసుకుంది. మొదట ఇద్దరు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ వైపు వెళ్లగా, ఆ తర్వాత 10 మంది ఎమ్మెల్యేలు టీడీపీ శాసన సభా పక్షాన్ని టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయాల్సిందిగా అప్పటి స్పీకర్ మధుసూదనా చారిని కోరడం, ఆయన దాన్ని ఆమోదించడం చకచకా జరిపోయాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 15 సీట్లు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ నుంచి చివరకు రేవంత్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, ఆర్. కృష్ణయ్య మాత్రమే టీడీపీ ఎమ్మెల్యేలుగా మిగిలారు. ఇక తెలంగాణలో 2018 ఎన్నికల తర్వాత ఎన్నికైన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు( సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు ) కూడా తమను పార్టీలో విలీనం చేసుకోవాల్సిందిగా టీఆర్ఎస్ను కోరగా ఆ విలీనం కూడా జరిగిపోయింది. అదే విధంగా కాంగ్రెస్ పక్షం నుంచి 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్లో చేరిపోయారు. 2018 ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ నుంచి 19 మంది ఎమ్మెల్యేలు ఎన్నిక కాగా, ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య కేవలం ముగ్గురే (శ్రీధర్ బాబు, పోడెం వీరయ్య, మల్లు భట్టి విక్రమార్క) మిగిలిన సంగతి తెలిసిందే. మరి ఆనాడు ఫిరాయింపులను ఇష్టారీతిన ప్రోత్సహించిన టీఆర్ఎస్ పార్టీ... ఈ రోజు అదే ఫిరాయింపులు జరుగుతుంటే... గగ్గోలు పెట్టడంలో బీఆర్ఎస్కు ఏమైనా నైతికత ఉందా? అని ప్రశ్నించుకోక తప్పదు. ప్రెస్మీట్లో విలేకర్లు ప్రశ్నలు అడుగుతుంటే... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇస్తున్న సమాధానం నిజంగా హ్యాస్యాస్పదంగా ఉంటుంది. తాము శాసనసభ పక్షాన్ని విలీనం చేసుకున్నామని, అది రాజ్యాంగబద్ధమని చెబుతున్నారు. మరి విలీనం చేసుకోవడానికి ఎమ్మెల్యేలు ఒకటేసారి వచ్చారా? పలుదఫాలుగా వచ్చినవారా? అన్న విషయం కేటీఆర్కి తెల్వదా? దానిపై ఎందుకు మాట్లాడటం లేదు? ఒకరిద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్లో చేరతామని చెప్పి, మరికొందరు కూడా వస్తారని బహిరంగంగా చెప్పినప్పుడే వారు ఫిరాయించినట్టు కాదా? అది చీలిక కాదు, విలీనమూ కాదు. విడివిడిగా వచ్చిన ఆ ఎమ్మెల్యేల సంఖ్య 12 అయ్యే దాకా ఆగి, తరువాత తీరిగ్గా టీఆర్ఎస్లో చేర్చుకోవడం అంటాం. విలీనం చాటున ఇవి 12 ఫిరాయింపులు అనక తప్పదు. విలీనానికి కావలసిన సంఖ్య కన్నా తక్కువ మంది ఫిరాయించినట్టు ప్రకటించి అనర్హులుగా గుర్తించాలని అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిని స్పీకర్ను కలిసి ఫిర్యాదు చేస్తే చేశారు సభాపతిని అడ్డం పెట్టుకొని నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అటువంటి ప్రభుత్వం నడిపిన కేటీఆర్, ఈ రోజు ప్రస్తుతం స్పీకర్ ప్రసాద్ కుమార్కి తన బాధ్యతలు గుర్తు చేయడం సహేతుకం అంటారా? వారే ఆత్మసమీక్ష చేసుకోవాలి. ఆనాడు తమ ప్రభుత్వ హయాంలో స్పీకర్ సాయంతో ఫిరాయింపులను విలీనంలాగా ఆమోదించడం అంటే 10 షెడ్యూలును పరిహసించడం కాదా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. అందుకే, తెలంగాణ ప్రజలు ఈ ప్రక్రియను నీవు నేర్పిన విద్యయే నీరజాక్షి అంటున్నారు. ఈ మాటలను కేటీఆర్, కేసీఆర్లకు ప్రెస్మీట్లో పలువురు విలేకర్లు గుర్తు చేస్తే... అసలు ఫిరాయింపులను ప్రోత్సహించిందే కాంగ్రెస్ అంటూ బుకాయిస్తున్నారు. 2004, 2009 నుంచి కూడా రాష్ట్రంలో అసమ్మతి ఎమ్మెల్యేలను చూశాం కానీ... నేరుగా ఫిరాయింపుల ప్రక్రియ చూడలేదు. ఒక ఫిరాయింపు ఎమ్మెల్యేకు నేరుగా మంత్రి పదవి ఇచ్చిన సంస్కృతికి టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే తెరదించిందన్న విషయాన్ని ఆ పార్టీ పెద్దలు గుర్తించాలి.

**ఈ దుర్నీతిని అన్ని పార్టీలు నిలువరించాలి:**

అయితే, ఫిరాయింపు అనేదే ఒక దుర్మార్గపు ప్రక్రియ. దీని నుండి రాజకీయ పార్టీలు బయటకు రాలేకపోతున్నాయి. దేశంలోని ప్రతి రాజకీయ పార్టీ ఫిరాయింపు అనే బురదలోనే కొట్టుకుపోతున్నది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా... ప్రతిపక్ష గొంతు లేకుండా చేయాలంటూ వీటికి ఒడిగడుతున్నాయి. చరిత్రలో పార్టీ ఫిరాయించడమంటే ఒకరిద్దరు ఎమ్మెల్యేలో, ఎంపీలో వేరే పార్టీలోకి మారిపోవడం లేదంటే, మద్దతుపలకడం ఉండేది. పార్టీ ఫిరాయింపుల చట్టం వచ్చే వరకు అలాంటి వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేది కాదు. 1960ల నాటికి ఈ ధోరణి బాగా పెరిగిపోయి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల అస్థిరత అనే సమస్య తీవ్రమైంది. 1969 నాటి వైబీ చవాన్ నేతృత్వంలోని కమిటీ నివేదిక, నాలుగో సార్వత్రిక ఎన్నికల తరువాత, మార్చి 1967, ఫిబ్రవరి 1968 మధ్య ఉన్న ఏడాదిలోపు కాలంలో అనేక రాష్ట్రాలలో శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో పార్టీని ధిక్కరించినట్లు పేర్కొంది. మొదటి సార్వత్రిక ఎన్నిల నాటి నుంచి నాలుగో సార్వత్రిక ఎన్నికల నాటికి సుమారు రెండు దశాబ్దాల కాలంలో 542 ఫిరాయింపు సంఘటనలు జరిగితే, కేవలం 1967 68 మధ్య కాలంలోనే కనీసం 438 ఫిరాయింపులు జరిగినట్లు చవాన్ కమిటీ గుర్తించింది. ఈ రెండు దశాబ్దాలలో 376 మంది ఇండిపెండెంట్ సభ్యుల్లో 157 మంది వేరే పార్టీలకు మారారు. పదవులను ఆశించి ఎక్కువమంది ఫిరాయింపులకు పాల్పడ్డారని కూడా ఈ కమిటీ పేర్కొంది. ఈ కాలంలో వివిధ రాష్ట్రాలలో ఫిరాయించిన 210 మంది శాసనసభ్యులలో 116 మందికి మంత్రి పదవులు దక్కాయి. అప్పటి నుంచే 'ఆయా రామ్, గయా రామ్' అనే నానుడి దేశ రాజకీయాల్లో బాగా ప్రసిద్ధి పొందింది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కేంద్రం ఫిరాయింపుల నిరోధక చట్టం తీసుకువచ్చింది. కానీ, విలీనం విషయంలో ఆయా పార్టీ నిర్ణయాత్మక కమిటీలో చీలిక వచ్చినప్పుడు విలీనం చేసుకోవాలా? లేక శాసనసభాపక్షంలో చీలిక వచ్చినప్పుడు విలీనం చేసుకోవాలా అన్న అంశంలో అప్పటి శాసనకర్తలు స్పష్టతనివ్వడం లేదు. దీనిపై సుప్రీంకోర్టు కూడా ఒక మౌలిక ఆదేశాన్ని కేంద్రానికి ఇవ్వడం లేదు. అందుచేత, ఈ విషయం ఇటు దేశ రాజకీయ వ్యవస్థను, అటు ప్రజాస్వామికంగా ఎన్నికవుతున్న శాసనవ్యవస్థను పట్టిపీడిస్తున్నది. ఇప్పటికైనా, ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకేదాటికి పోరాడితేనే ప్రస్తుత రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయలేమన్న విషయాన్ని గుర్తెరగాలి. లేదంటే, ఆయా రాం... గయారాంలతో అడుగులు వేస్తూ... నడవాల్సిందేనన్న చేదు నిజాన్ని ఒప్పుకోక తప్పదు.



సాగర్ వనపర్తి,
సీనియర్ జర్నలిస్టు,9494041258.

# నేమ్ ప్లేట్స్ ఉండాల్సిందే

- కన్వర్ యాత్ర నేపథ్యంలో యూపీ సర్కారు
- హోటళ్లు, తోపుడు బండ్లు కూడా ప్రదర్శించాలి
- భక్తులకు ఆ హక్కు ఉంటుంది

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

కన్వర్ యాత్ర నేపథ్యంలో ఆ మార్గంలో ఉన్న దుకాణదారులు నేమ్ ప్లేట్లు పెట్టుకోవాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాలు రాజకీయ వివాదానికి దారితీస్తున్నాయి. ఇప్పుడు అదే దాదిలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తాజాగా ఉజ్జయినిలోని హోటళ్లు, తోపుడుబండ్లపై విక్రయాలు జరిపేవారు వాటిపై తమ పేర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించింది. క్యూఆర్కోడ్, ఫోన్ నంబర్ను కూడా జతచేయాలని పేర్కొంది. ఈ ఆదేశాలు ఉల్లంఘించిన వారికి రూ.2,000 నుంచి రూ.5000 వేల వరకు జరిమానా విధిస్తామని, వారి స్టాల్స్ను తొలగిస్తామని హెచ్చరించింది. యాత్రికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, ముస్లింలు తమ లక్ష్యం కాదని ఉజ్జయిని మేయర్ ముఖేష్ తత్వాల్ తెలిపారు. ''ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేమ్ ప్లేట్ లు ఒకే పరిమాణం, రంగులో ఉండాలని మొదట చెప్పినందుకు అమలులో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఈ నిబంధనలు సడలించాం. దుకాణాల యజమానులు వారి పేర్లు, ఫోన్ నంబర్లు ప్రదర్శిస్తే సరిపోతుంది. ఎందుకంటే ఉజ్జయిని హిందువులకు పవిత్రమైన నగరం. దుకాణాల యజమానుల వివరాలు తెలుసుకునే హక్కు భక్తులకు ఉంటుంది'' అని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధనలను ఇప్పటికే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తుండగా, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తాము కూడా ఈ విషయంలో చర్యలు చేపడుతున్నట్లుగా తెలియజేశారు. విపక్షాలు మాత్రం దీనిని తీవ్రంగా తప్పుపడుతున్నాయి. భారత సంస్కృతిపై ఇదొక దాడి అని కాంగ్రెస్ విరుచుకుపడింది. కాగా కన్వర్ యాత్ర జులై 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్రలో భాగంగా ఏటా శ్రావణ మాసంలో పక్షం రోజుల పాటు శివ భక్తులు గంగా నదీజలాలను సేకరిస్తుంటారు.





# ఘనంగా హరీష్ రావు జనదిన వేడుకలు

- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ కొరిమిశెట్టి సాయిబాబా

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరి శెట్టి సాయిబాబా గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం తెల్లాపూర్ సాయిబాబా ఆలయం సందర్శించారు. ఆలయ వ్యవస్థాపకులు వాలా హరీష్ రావు, కార్పొరేటర్ సాయిబాబాను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు వాల హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన్ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు ఇలాంటి వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీసీ సంఘం అధ్యక్షులు బాబు మోహన్ మల్లేష్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# విద్యా వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

- ఐఏఎస్ ఆకునూరి మురళీ
- జెవివి విద్యా వైద్యం పై సెమినార్

**సికింద్రాబాద్ , విశాలభారతి :**విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి అన్నారు. విద్యతోనే సమాజ మార్పు సాధ్యమని చెప్పారు విద్యారంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. మనదేశంలో ప్రైమరీ స్కూల్స్ పై ఇప్పటికీ ప్రభుత్వాలకు , ప్రజలకు ఒక స్పష్టత లేదన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ, ఆంధ్ర మహిళా సభ డిగ్రీ ఉమెన్స్ కళాశాల ఆధ్వర్యంలో "విద్యా, వైద్య రంగాలు సవాళ్లు " అనే అంశంపై సెమినార్ నిర్వహించిన లో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు ఆకునూరి మురళి మాట్లాడుతూ. విద్యార్థుల్లో చిన్నప్పటినుంచి శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా పాఠ్యాంశాలు ఉండాలని, ఇందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. విద్యారంగానికి ప్రభుత్వాలు తమ బడ్జెట్లో కేటాయించాల్సిన స్థాయిలో నిధులను కేటాయించడం లేదని అన్నారు. విద్యకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ప్రాథమిక విద్యనుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలను పెంపొందించేలా పాఠ్యపుస్తకాలను రూపొందించాలని కోరారు. యూనివర్సిటీ స్థాయిలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు సైతం అశాస్త్రీయ పద్ధతులను పాటించడం ఏంటని ప్రశ్నించారు. యువత ఎక్కువగా సాంకేతిక విద్య పట్ల ఆసక్తి చూపుతోందని ఇది ఏ మాత్రం మంచిది కాదన్నారు. సామాజిక అంశాలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఆర్ట్స్ ,సైన్స్ సమాజ అభివృద్ధికి దోహదం చేస్తాయని కావున విద్యార్థులు సాంకేతిక విద్య కే ప్రాధాన్యత కాకుండా సామాజిక అంశాలకు కూడా ఎంచుకోవాలని కోరారు. సెమినార్ హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ. సమాజంలో పేదలకు సరైన న్యాయం అందడం లేదన్నారు. చట్టం ఒకటే అయినా అది అందరికీ సమానంగా అందడం లేదన్నారు. పేదలకు ఒకలా, ధనవంతులకు మరోలా న్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ విరించి విరివింటి మాట్లాడుతూ. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. కానీ ప్రభుత్వాలు ఈ బాధ్యతనుండి క్రమంగా తప్పుకుంటున్నాయని చెప్పారు. చిన్న చిన్న రోగాలకు కూడా పేదలు కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు దేశంలో నెలకొన్నాయని చెప్పారు. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం ఫలితంగా పేదలు చిన్న చిన్న వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సర్కార్ ఆస్పత్రులను బలోపేతం చేయాలని ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వర్ రావు, టి. శ్రీనాథ్, రాష్ట్ర నాయకులు వెంకటరమణారెడ్డి, జితేందర్, చెలిమెల రాజేశ్వరరావు, ప్రొఫెసర్ బి.యస్.రెడ్డి, డాక్టర్ రమాదేవి, ఎస్పీ లింగస్వామి ,రవీంద్రబాబు ,భీమేశ్వర్,ఆంధ్ర మహిళా సభ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి. రజిని ,ప్రిన్సిపల్ డాక్టర్ ఝాన్సీ రాణి, అధ్యాపకులు కరుణ ,వసుంధర, సంధ్యారాణి పాల్గొన్నారు.



# విద్యా వ్యవస్థను బలోపేతం చేసే భాధ్యత ఉపాధ్యాయులదే

- డీఏలను సత్వరం విడుదల చేయాలి
- సిపియస్ విధానాన్ని రద్దుచేసి,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- ఎస్టీయూటిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**బదిలీలు, పదోన్నతులతో ప్రభుత్వ పాఠశాలల్లోని అన్నీ ఖాళీలను నింపే ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసిందని, పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్ లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయులకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి , కార్యదర్శి సదానందం గౌడ్ వారిరువురూ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్నదని, విద్యారంగ ప్రమాణాలు పెంచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించిందని , అనేక సమస్యలకు పరిష్కారం చూపిందని అన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, ఎంఈఓ పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడుతామని అన్నారు. సమస్యల సాధనకు సంఘాలన్నీ కలసిరావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత విద్యారంగంలోని అనేక సమస్యలను ప్రస్తావించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్ లో ఉన్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం పట్ల ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సిపియస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని , బదిలీ అయి రిలీవ్ కాని టీచర్లను ప్రత్యామ్నాయ పద్ధతులతో వెంటనే రిలీవ్ చేయాలని, ల్ అన్నారు. పెండింగ్లో ఉన్నఅన్ని డిఏ లను సత్వరం విడుదల చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో సర్వీస్ పర్సన్లను నియమించి పాఠశాల పరిశుభ్రతను కాపాడాలన్నారు. నలభై శాతం ఫిట్ మెంట్ లో నూతన పిఆర్సిని అమలు చేయాలన్నారు. తదుపరి పదోన్నతులు,బదిలీలు పొందిన ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండు రంగారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస రావు, వీరమణి,రాజమణి,రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్.ఏ.వి,రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాతంగి,జిల్లా ఆర్థిక కార్యదర్శి బాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప సొసైటీలో యథేచ్ఛగా నిర్మాణాలు

- కోర్టు ఆదేశాలూ బేఖాతరు
- ఎన్నికల సమయంలో వెలిసిన బడా నిర్మాణలు
- బడా నేతలు, అధికారుల కనుసన్నల్లో నిర్మాణాలు
- హైకోర్టుకు లేఖ రాసిన సొసైటీ సభ్యులు
- పత్రికల్లో వచ్చిన కథనాలతో హడావిడి
- మళ్లీ యథావిధిగా అక్రమ నిర్మాణాలు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**హైదరాబాద్ నడిబొడ్డున అక్రమ నిర్మాణాలు జోరుగా సాగాయనడానికి ఈ ఫొటోలే నిదర్శనం. అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు హడావుడిగా కూల్చివేతలు చేపట్టారు. అప్పుడు సామాన్యుల భవనాలు మాత్రం కూల్చివేశారు. పలుకుబడి ఉన్న బడా బాబుల నిర్మాణాలకు ఇలా చిన్న రంధ్రాలు పెట్టి.. 'తర్వాత కట్టేసుకోండి' అన్నట్లుగా వదిలేశారు. నాడు రంధ్రం పెట్టిన చోట నేడు నిర్మాణాలు పూర్తి కావొచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ ఇలాంటి నిర్మాణాలు అనేకం ఉన్నాయి.

ఎన్నికల సమయంలో గురుకుల్ ట్రస్ట్ అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, గోకుల్ ప్లాట్స్, వివాదాస్పద భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ భవనాల నిర్మాణాలు చక చక పూర్తి చేశారు. ఎన్నికలు ముగియగానే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం దృష్టి సారించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుందని అంతా అనుకున్నారు.ఈ తతంతగమంతా హైటెక్ సిటీ సమీపంలోని అయ్యప్ప సొసైటీ, గోకుల్ ప్లాట్స్ లో జరుగుతోంది.ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో అక్రమ భవన నిర్మాణాలు జరిగిపోతున్నాయి.కొందరైతే రెండు నెలల్లోనే అయిదారంతస్తుల భవనాలునిర్మించేశారు. ఇందులో పెద్దపెద్ద భవంతులు కొన్ని ఇప్పటికే పూర్తికాగా,మరికొన్నింటి పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డున్న కొనసాగుతున్న ఈ అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోతున్నాయి. విద్యుత్ అధికారులు కూడా కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. గురుకుల్ ట్రస్ట్ భూములున్న అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా లేఅవుట్ లో ఈ అక్రమ నిర్మాణాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. గురుకుల్ ట్రస్ట్ భూములపై న్యాయస్థానం స్టేటస్కో ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండడం గమనార్హం. ఈ దందా వెనుక అధికారంలో ఉన్న కొందరు పెద్దలతో పాటు స్థానిక అధికారులు, రాజకీయ నేతల హస్తం కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. హడావిడిగా చేపడుతున్న ఈ నిర్మాణాలు లోపభూయిష్టంగానే జరుగుతున్నాయి. ఎలాంటి సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మిస్తున్నారు. కనీసం నిర్మాణ సంస్థ నిర్మాణ సమయంలో కార్మికుల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవడం లేదు.వారి ప్రాణాలను బలి చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఇక్కడి ఫ్లాట్లను కొన్నవారు భవిష్యత్తులో ఇబ్బంది పడక తప్పదు.

**ఫ్లోర్‌కో ధర..**

అయ్యప్ప సొసైటీలో అనధికారికంగా నిర్మాణాలకు వెల కట్టి ఆ మేరకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు కప్పం వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరిగే అక్రమ నిర్మాణాలకు స్థలం, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లు చేసున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు కలిసి ఈ దందా నిర్వహిస్తున్నారు. ఫ్లోర్‌కు ఇంత అని ధర నిర్ణయిస్తున్నారు. అలా చెల్లించి నిర్మాణ పనులు మొదలుపెట్టే భవనాల జోలికి ఏ శాఖ అధికారీ వెళ్లరు. కొందరు స్థానిక నేతలు భవన నిర్మాణ పనుల కాంట్రాక్టు తీసుకుని, దగ్గరుండి మరీ కట్టిస్తున్నారు. మరికొందరైతే భూ యజమానులపై ఒత్తిడి తెచ్చి డెవలప్‌మెంట్‌కు తీసుకుంటున్నారు. ఇందులో జీహెచ్ఎంసీలో కీలక పదవిలో ఉన్న నేతతో పాటు బడా వ్యాపారి, ఓ ఎమ్మెల్సీ పేరు వినిపిస్తోంది.

**గురుకుల్ భూములు.. వివాదాలు**

రంగారెడ్డిజిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో గురుకుల్ ట్రస్ట్‌కు 625 ఎకరాలు ఉన్నాయి. బన్సీలాల్ అనే దాత సామాజిక కార్యక్రమాలకు, పేద విద్యార్థుల చదువుల కోసం ఈ భూములను దానంగా ఇచ్చారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ ట్రస్ట్ ఆధీనంలో ఈ భూములు ఉండేవి. ఈ స్థలాన్ని అప్పట్లో ట్రస్టు సభ్యులు కొందరు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. అదేవిధంగా అయ్యప్ప సొసైటీ కూడా 125 ఎకరాల్లో ఏర్పడింది. ఇందులో 1200 ప్లాట్లను ఉద్యోగులు, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు కొనుగోలు చేశారు. అవి సీలింగ్ భూములని, అమ్మకాలు చెల్లవని అప్పట్లో ప్రభుత్వం నిర్మాణాలను అడ్డుకుంది. కాగా.. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 747 జీవో కింద ఈ భూములను క్రమబద్ధీకరిస్తామని తెలిపింది.ఈ మేరకు కొంత మొత్తాన్ని స్థల యజమానుల నుంచి వసూలు చేసింది. కానీ, అంతలోనే ఆ భూములపై తమకు హక్కు ఉందని, వాటిని క్రమబద్ధీకరించడం వీలు కాదని



సర్వే ఆఫ్ ఇండియాలో చేపడుతున్న అక్రమ నిర్మాణం.



అయ్యప్ప సొసైటీ, అన్నపూర్ణ మెస్ వెనుక పూర్తి కావచ్చిన అక్రమ నిర్మాణం.

దేవాదాయశాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో ఈ భూములపై ప్రభుత్వానికి, ట్రస్టుకు, సొసైటీలకు మధ్య కోర్టులో వివాదం నడిచింది.2015లో దీనిపై హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసిన వారికి క్రమబద్ధీకరించాలని, అలా వచ్చిన సొమ్ముతో ట్రస్ట్‌కు భూములు కొనివ్వాలని ఆదేశించింది. దీనిపై కొందరు రివ్యూ పిటిషన్లు వేయగా కోర్టు కొట్టేసింది. అయితే ఇప్పటికీ హైకోర్టు ఆదేశాలు అమలవలేదు. ఈ భూములకు సీలింగ్ వర్తిస్తుందని, వీటిపై వచ్చే ఆదాయం తమకే దక్కాలని ప్రభుత్వం మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వివాదం పరిష్కారమయ్యేంత వరకు ఎలాంటి నిర్మాణాలూ చేపట్టవద్దని కోర్టు ఆదేశించింది. ఇప్పుడిదే ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండడం గమనార్హం.

**కథనంతో అక్రమాలకు అడ్డుకట్ట**

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై గత ఏడాది పత్రికల్లో వరుస కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఉరుకులు పరుగులు పెట్టి దాదాపు 25 అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు.బడాబాబులకు చెందిన భవనాలకు మాత్రం చిన్నచిన్న రంధ్రాలు పెట్టి ముగించారు.

**బడాబాబుల కనుసన్నల్లో..**

గ్రేటర్‌లో సాధారణంగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకే జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు నానా ఇబ్బందులు పెడుతుంటారు. కానీ, అయ్యప్ప సొసైటీ విషయంలో మాత్రం నిబంధనలన్నీ మారిపోతున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 2014లో గురుకుల్ అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర చేసింది. కొన్నింటిని కూల్చివేసింది. ఆ తర్వాత అక్కడ బడాబాబులకు చెందిన అనేక నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోయాయి. అప్పట్లో కూల్చివేసిన 70శాతానికిపైగా స్థలాల్లో మళ్లీ అక్రమ నిర్మాణాలు పూర్తిస్థాయిలో వచ్చేశాయి. మధ్యతరగతి వారు మాత్రం ఒక్క ఇటుక కూడా మళ్లీ పెట్టుకోలేకపోయారు. ఎందుకంటే వీళ్లు పని మొదలుపెట్టగానే జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చి పనులు నిలిపివేస్తుంటారు. అయితే వీరి పక్కనే పెద్ద పెద్ద భవంతుల నిర్మాణాలు చకచకా జరిగిపోతున్నాయి. ప్రభుత్వంలోని కొందరు పెద్దలు దగ్గరుండి మరీ వీటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో కొందరు ప్రజాప్రతినిధుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

**హైకోర్టుకు ఫిర్యాదు**

ఈ అక్రమ నిర్మాణాల వ్యవహారంపై స్థానిక గురుకుల్ ట్రస్ట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్న జాబితాను కూడా జతచేసి పంపారు.

**జీహెచ్ఎంసీదే నిర్మాణాల బాధ్యత**

అయ్యప్ప సొసైటీ భూములపై సుప్రీంకోర్టు స్టేటస్ కో కొనసాగుతోందని అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ , అమోయ్ కుమార్ 'మీడియా'కి తెలిపారు. అయితే అక్కడ అక్రమ నిర్మాణాలను అడ్డుకునే బాధ్యత జీహెచ్ఎంసీదేనని ఆయన స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల విషయం తమ దృష్టికి రాలేదని, దీన్ని తాము కూడా పరిశీలిస్తామని చెప్పారు.మరి ప్రస్తుత కలెక్టర్ శశాంక్ ఎలా స్పందిస్తారో చూడాలి..!?



# ఉజ్జయిని అమ్మ మా ఇంటి ఇలావేల్పు

- టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పల్లె లక్ష్మణ్ రావు గౌడ్

**విశాలభారతి,కంటోన్మెంట్ :**ఉజ్జయిని మహంకాళి తమ ఇలవేల్పు అని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ స్పష్టం చేశారు. ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా ఆహార వితరణ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ నియోజకవర్గం,మల్టీపర్పస్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేశారు.గత 40 సంవత్సరాలు గా అమ్మవారికి బోనాలు నిర్వహిస్తూ, ఆహార వితరణ కార్యక్రమం తరతరాలుగా కొనసాగిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కోరిన కోరికలు తీర్చే అమ్మవారు ఉజ్జయిని అమ్మవారని కొనియాడారు. తమ తండ్రులతండ్రుల నుండి అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితిగా వస్తుందని స్పష్టం చేశారు. ఆహార వితరణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్,స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్,పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, స్థానిక పార్టీ కార్యకర్తలు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



# మేయర్, డిప్యూటీ మేయర్ లను కలిసిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

**బోడుప్పల్, విశాలభారతి:**బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ లను 13వ డివిజన్ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి ల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ మేరకు డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు మేయర్, డిప్యూటీ మేయర్లకు తమ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోపు రాము, డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు, మహిళలు, పురుషులు, యువత తదితరులు హాజరయ్యారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్

**కూకట్ పల్లి విశాలభారతి** గురు పౌర్ణమి,ఆషాడ మాస బోనాలు సందర్భంగా ఆదివారం కూకట్ పల్లి లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.కెపిహెచ్బి కాలనీ రోడ్ నెంబర్ 2 లో సాయిబాబా టెంపుల్ లో కమిటీ అధ్యక్షుడు ఎల్. రాజా ఆధ్వర్యంలో, బాలాజీ నగర్ లోని సాయి బాబా ఆలయంలో సాధు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో బాబా వారికి ఆదివారం ప్రత్యేక పూజలు అలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై సాయి బాబాకి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా పూలవిద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మూసాపేట హెచ్ పి రోడ్లో తూము సంతోష్ ఆధ్వర్యంలో అమ్మవారికి జరిగిన పూజా



కార్యక్రమాల్లోనూ రమేష్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు ,మైకేల్, బచ్చు రాజా, అరవింద్ రెడ్డి, నళిని కాంత్, కమిటీ నిర్వాహకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# అక్రమ నిర్మాణాల జోరు

- మున్సిపల్ అధికారులు పట్టించుకోరేం
- నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మున్సిపాలిటీ సిబ్బంది తీరుపై మండిపడుతున్న జనం
- అక్రమ నిర్మాణాల వెనుక చోట మోట లీడర్లు

**విశాలభారతి , ఇబ్రహీంపట్నం:**నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదనే విషయం జోరుగా సాగుతోంది. సామాన్యులు, మధ్యతరగతి ఉద్యోగుల చిన్నచిన్న నిర్మాణాలపై అధికారులు తమ ప్రతాపం చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్ పల్లి , ఆదిభట్ల టీసిఎస్ , బొంగుళూరులలో దాదాపు జీ ప్లస్ టూ కి మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ కొంతమంది బిల్డర్లు అధికారులతో కుమ్మక్కై నాలుగు నుంచి ఆరు అంతస్తుల వరకు భవంతులు నిర్మిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది "మాములు" గా తీసుకుని , చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే వినికిడి వినిపిస్తోంది. కొన్ని ప్రాంతాలలో నిర్మాణాలు చేపట్టవదంటూ హైకోర్టు స్టేటస్‌కో ఆదేశాలు అమలులో ఉన్నా, అక్రమ నిర్మాణాలు మాత్రం యథావిధిగా సాగుతున్నాయి. అంతేగాకుండా అక్రమ నిర్మాణాలకు కొంతమంది రాజకీయ నేతలు చోట మోట లీడర్ల అండగా నిలుస్తుండటంతో చర్యలు తీసుకునేందుకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జంకుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆదిభట్ల మున్సిపాలిటీ కుప్పలు తెప్పలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తోన్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్న ధాఖలాలు లేవు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే దాని ఆధారంగా టౌన్ ప్లానింగ్ పనిచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తోన్నాయి.

**నోటీసులతో సరి పెట్టారు**

పరిమితులు లేకుండా అదనపు అంతస్తులు అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారే సమాచారం తో గత కొన్ని రోజుల క్రితం నిర్మాణం లో ఉన్న ఇండ్ల వద్ద మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. పర్మిషన్ తీసుకుని ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. భవంతుల నిర్మాణం కొన్ని రోజులు ఆపి రాత్రి వేళలో పని కనిచ్చేశారు. మళ్ళీ కొన్ని రోజుల తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ యదేచ్ఛగా నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అక్రమ నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లపై కానీ ఇంటి యాజమానులపై చర్యలు తీసుకోవడం లో అధికారులు విఫలం అయ్యారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.



# ఘనంగా "మహంకాళి" అమ్మవారి బోనాలు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**ఇబ్రహీంపట్నం మహంకాళి అమ్మవారి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారిని దర్శించుకోవడం కోసం భక్తులు బారులు తీరారు. ఆదివారం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు.. తలపై బోనంతో అమ్మవారి నామస్మరణ చేస్తూ మహంకాళి ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలు, డప్పువాయిద్యాలతో ఇబ్రహీంపట్నంలోని ఆయా కాలనీలు మార్మోగాయి. మహిళలు బోనాలతో ఊరేగుతూ ఆలయాలకు చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు, వాలంటీర్లు క్యూ పద్ధతిలో భక్తుల రద్దీని నియంత్రించారు..

# రైతు రుణమాఫీలో రేషన్ కార్డు నిబంధనలు తొలగించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



**సూర్యాపేట,విశాలభారతి** రైతు రుణమాఫీలో రేషన్ కార్డు నిబంధనలు తొలగించాలి అని గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయలేదని రైతు కుటుంబం గుర్తింపుకి ఆహార భద్రత కార్డు క్రైటీరియాగా తీసుకోవటం సరైంది కాదని వెంటనే నిబంధన తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రుణమాఫీ నిబంధనలు వలన అనేక మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ఈ పది సంవత్సరాలలో వివాహం అయ్యి వేరే కుటుంబాలుగా ఉంటూ వ్యవసాయం చేస్తున్న యువ రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఉన్న రద్దు అయ్యే పరిస్థితి లేదని వెంటనే రేషన్ కార్డు నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకం కలిగిన రైతులకు రుణమాఫీ అంటే ధరణి పాసుపుస్తకాలు కంటే ముందు చేతి రాత పహాణినకల, మీ పహణి ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు వర్తించకుండా పోయే అవకాశం ఉందని రాష్ట్రంలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్నా రైతు కుటుంబాల వారసులకి ధరణి పాస్ పుస్తకాలు మంజూరు కాక పెండింగ్లో ఉన్నాయని అలాంటి రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశం లేదని అన్నారు. 2014 సంవత్సరం నుంచి కేసిఆర్ ప్రభుత్వం రెండు దఫాలుగా అమలు చేసిన రుణమాఫీ కాకుండా రైతులు ఇంకా ఉన్నారు అని ఆ రైతులు బ్యాంకు రుణాలు 2018 డిసెంబర్ 12 గడువు లేకుండా రైతు రుణమాఫీ వర్తింపు చేయాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవోలో పేర్కొన్న నిబంధనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి బ్యాంకులో అప్పు ఉన్న రైతులందరూ రుణమాఫీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.





## ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గేకి

# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు

**పటాన్ చెరు,విశాలభారతి** ప్రజా సమస్యల పై పార్లమెంట్ లో అలుపెరగని పోరాటం చేస్తున్న మహానేత ప్రజా గొంతుక మల్లికార్జున ఖర్గే అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకొని బెంగళూరులోని ఆయన నివాసంలో మాజీ సీఎం వీరేంద్ర పాటిల్ కుమారుడు కైలాష్నత్ పాటిల్,ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మాల బి నారాయణ్ రావు, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్ గోపాల్ రెడ్డితో ఖర్గెను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిలబడి పార్లమెంటులో కాంగ్రెస్ పక్షాన తన గొంతుక వినిపిస్తున్నడన్నారు. ఖర్గే నాయకత్వంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరిన్ని విజయాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాజీ సీఎం ధారాంసింగ్ కుమారులు జీవరాగి ఎమ్మెల్యే డాక్టర్ అజయ్ ధారాంసింగ్ తో మర్యాదపూర్వకంగా బేటీ అయ్యారు.

**మత్స్యకారులకు వరం 'మత్స్య దర్శిని'..**

మత్స్యకారులకు ఆర్థికంగా చేయూతనందించే విధంగా కర్ణాటక ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మత్స్య దర్శిని పథకం వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని నీలం మధు ముదిరాజ్ అన్నారు. బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్సీ జగదేవ్ గుట్టేదార, ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మాల బి నారాయణరావు, కేపిసిసి జనరల్ సెక్రెటరీ రాజ్ గోపాల్ రెడ్డితో కలిసి కర్ణాటక ఫిషరీష్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్ రిటైల్ , ఫిష్ సీడ్ సేల్, రెస్టారెంట్ లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కర్ణాటకలో మత్స్యకారులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



# అమీన్ పూర్ లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

- మున్సిపల్ చైర్మన్ టిపిఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ

**పటాన్ చెరు(అమీన్ పూర్),విశాలభారతి:** గురు పౌర్ణమి పురస్కరించుకొని అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు కట్టపై గల సాయిబాబా దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు. తదనంతరం..21 రోజుల సాయిబాబా దీక్షను విరమించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి తన జీవితాంతం గురువుతో అనుబంధం ఏర్పరచుకొని, వారి మార్గదర్శకత్వంలో ముందుకు వెళతారని తెలిపారు. ప్రతి ఏటా గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ టిపిఆర్ కుటుంబ సభ్యులు, పట్టణ పుర ప్రముఖులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# గురువులకు కృతజ్ఞత చెప్పుకునే పండుగ గురుపౌర్ణమి

**మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి** ప్రతి ఒక్కరూ గురువులకు కృతజ్ఞత చెప్పుకునేందుకు జరుపుకునే పండుగ గురుపౌర్ణమి అని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక 18వ వార్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లో గల సాయిబాబా మందిరంలో వార్డ్ కౌన్సిలర్ మాలోత్ కమల చంద్రునాయక్ ఆధ్వర్యంలో జరిగిన గురుపూర్ణమి ఉత్సవంలో ఆయన మాట్లాడారు. సనాతన హైందవ ధర్మంలో తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకే దక్కిందన్నారు. పైగా ఈ సృష్టిలో మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతిక్షణం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడని పేర్కొన్నారు. అందులో కొంత తల్లిదండ్రుల వద్ద నేర్చుకుంటే మిగిలినదంత గురువు దగ్గరే నేర్చుకుంటాడని అన్నారు. ఈ సందర్భంగా గురు పౌర్ణమి పర్వదినానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. అనంతరం గురు పౌర్ణమి ఉత్సవంలో పాల్గొని కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేనారెడ్డి తో కలిసి ఆయన స్వామివారి పల్లకి ని మోశారు. ఈ సందర్భంగా మందిరంలో ఏలే వేణుగోపాల్, జయమ్మల కుమారులు ఉపేందర్ ,యామిని లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

- ఎస్ఐ రాజేందర్



**కరకగూడెం, విశాలభారతి:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ పిలుపునిచ్చారు. వరదలకు చేపలకు వెళ్లడం కానీ ,కాలువలు దాటడం గాని ,వాగులు దాటడం గాని, ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని ఆయన తెలిపారు. ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి సమస్యలు ఉన్న తక్షణమే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఆదివారం మండలం పరిధిలోని వాగు ఉధృతి ప్రాంతాలైన బంగారు గూడెం, అనంతారం, కొత్తగూడెం గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్తగూడెం కొత్తూరు మధ్య వాగు ఉధృతంగా ఉండడంతో రాకపోకలు నిలిపివేశారు. ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి రాకపోకలను ఆపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయని చెరువులు కూడా నిండి అలుగుల ద్వారా నీరు ప్రవహిస్తున్నాయని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఎటువంటి సహాయం కావాలన్నా తక్షణమే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.




# పిఓడబ్ల్యూ నూతన కమిటీ ఎన్నిక

- పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులుగా మేకల రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల నర్సమ్మ

**కోదాడ, విశాలభారతి:** ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) సూర్యపేట జిల్లా ఏడవ మహాసభలు కోదాడ పట్టణంలో లాల్ బంగ్లాలో విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మేకల రాజేశ్వరి, ఉపాధ్యక్షులుగా బయ్య జయలక్ష్మి, అల్గుబెల్లి వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల నరసమ్మ, సహాయ కార్యదర్శులుగా పులుసు సుజాత, రామలింగమ్మ, కోశాధికారిగా గంట కావ్యలతోపాటు సభ్యులుగా సైదమ్మ, పోలెబోయిన ఐలమ్మ, కంచనపల్లి మల్లేశ్వరి, జయసుధ, వి సంతోష, దేశోజు ఆమని, ఖాత లింగమ్మ, వీరబోయిన సంపూర్ణ, మంగమ్మ, పి లక్ష్మి, శాంతమ్మ, గుణగంటి నీలమ్మ లను ఈ మహాసభలలో ఎన్నుకున్నారు. అనంతరం వీరితో పి ఓ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు జి ఝాన్సీ ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలలో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్ సీత పాల్గొని మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించడంలో వైఫల్యం చెందారని ఆమె అన్నారు.

# అవిశ్రాంత సూర్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు

- కుండ పోత వానలో నిరంతర ప్రయాణం
- బైపాస్ ఆపరేషన్ అయిన భయపడని నేత
- ఇచ్చిన మాట కోసం మడిమ తిప్పని ఎమ్మెల్యే



**భద్రాచలం, విశాలభారతి:** వృత్తిరీత్యా డాక్టర్ సేవాగుణంలో తనకు తానే సాటి, బీద బిక్కి బడుగు వర్గాలకు వైద్యం అందిస్తున్న అందరి బంధువు తెల్లం వెంకట్రావు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి తిరుగులేని ఆధిపత్యాన్ని చవిచూసిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ తెల్లం వెంకట్రావు. వైద్యంలోనూ ఇటు రాజకీయ రంగంలోనూ ఎనలేని ప్రజల ఆదరాభిమానాలను పొందిన ఏకైక నాయకుడు ఆదివాసి ముద్దుబిడ్డ డాక్టర్ తెల్లం వెంకటరావు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం కోసం అహర్నిశలు ప్రజల వద్దకే పాలన చేస్తున్నాడు. హార్ట్ సమస్యతో బాధపడుతూ చావు అంచులు కాడికి వెళ్లి ఆపరేషన్తో ప్రజల దీవెనలతో క్షేమంగా తిరిగి వచ్చి ప్రజాక్షేత్రంలో తమదైన శైలిలో ఆపరేషన్ అయిందన్న ఆలోచన మరచి ప్రజల మనిషిగా ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా కంటికి కునుకుని మరచి ఒంటికి సుఖాన్ని మరచి అనునిత్యం ప్రజల్లో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా నిరంతర శ్రామికుడై ప్రజల్లో ఉంటున్న ఏకైక నాయకుడు మన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎడతెరిపి లేని వానలు కుండపోత వర్షం పొంగుతున్న వరదలు ప్రజలను ముంచేత్తుతున్న వాగులు వంకలు ఆర్తనాదాల నడుమ ప్రజలు వాళ్ల అరణ్య రోధనకు పరిష్కార మార్గాలను వెతుకుతూ ఎంతటి జటిలమైన సమస్య అయినా చాకచక్యంగా పరిష్కారం చేస్తూ ముందుకు దూసుకుపోతున్న మహోన్నతమైన నేత ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. కొత్తగా నిర్మిస్తున్న కరకట్ట నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పనులు జాప్యం కాకూడదని కాంట్రాక్టర్లకు హిత బోధన చేస్తున్నాడు.




# లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మామిడి అశోక్

- ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు

**ఇనుగుర్తి, విశాలభారతి:** ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన మామిడి అశోక్ కేసముద్రం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల వివిధ హోదాలలో కలిగిన ప్రజాప్రతినిధులు,ప్రజా సంఘాల నేతలు, విద్యా సంస్థ అధినేత లతో పాటు ఉమ్మడి ఇనుగుర్తి, నాగారం గ్రామ ప్రజలు అభినందించారు. అంతర్జీతీయ స్థాయిలో గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్ లో కేసముద్రం మండల కమిటీ లో సభ్యుడిగా చేరిన నాటి నుండి నేటి వరకు తన వంతు సహాయంగా పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ , హాస్టల్ లల్లో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం ,క్లబ్ కార్యక్రమాల పట్ల నిబద్ధతో పాలు పంచుకోవడం తోనే అశోక్ కు అధ్యక్ష భాధ్యత వరించిందని కార్యక్రమానికి హాజరైన వారంతా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అయ్యగారి పల్లె మాజీ సర్పంచ్ మామిడి శోభన్ బాబు,ఎంపీటీసీ మాలోత్ చిన్న మంగ్యా నాయక్, విజ్ఞాన్ హై స్కూల్ కరస్పాండెంట్ గంజి వీరేందర్ రెడ్డి,గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం అధ్యక్షులు కూటికంటి మధు గౌడ్, మలిశెట్టి శ్యామ్, మలిశెట్టి రవి, మలిశెట్టి శోభన్,బొల్లు సంపత్, గుండ్ల వెంకన్న, నవనందుల శ్రీనివాస్, గోల్డ్ రాజు, శ్రీరాం వీరేందర్, మామిడి కిరణ్, గుండ్ల శరత్ లు పాల్గొన్నారు.




# 'కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక'

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని సూరజ్ నగర్ ఫేజ్ 3 కాలనీ నూతన సంక్షేమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా వై. భూపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్. సంజీవరెడ్డి, జగత్ రాజు, సెక్రటరీగా జి.శ్రీనివాస్ గౌడ్, జాయింట్ సెక్రటరీగా నర్సింహ, ట్రెజరర్గా జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. సీసీ రోడ్లు, యూజీడీ, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సలహాదారులు, సభ్యులు మల్లేష్ యాదవ్, శ్రీనివాస్, కృష్ణయ్య, వెంకటేష్ యాదవ్, వేణు, రామకృష్ణ, రమేష్ యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నిత్య పోరాట స్ఫూర్తి దాశరథి

- ఒక విశ్వవిద్యాలయానికి దాశరథి పేరు పెట్టాలి




**శేరిలింగంపల్లి,విశాలభారతి:** నిజాం నిరంకుశత్వంతో ప్రజల అల్లాడిపోతున్న సమయంలో పోరాట స్ఫూర్తితో తన సాహిత్యం ద్వారా ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన దాశరథి కృష్ణమాచార్యుల పేరుని శాశ్వతంగా నిలిచేటట్లు తెలంగాణాలోని ఒక విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెడితే బాగుంటుందని వక్తలు పేర్కొన్నారు.పీడన ఎక్కడ ఉంటుందో అక్కడ దాశరథి పోరాటస్ఫూర్తి ఉంటుందని, అందుకనే ఆయన వ్యక్తిత్వం, సాహిత్యం నిత్యం స్మరించుకొంటున్నారని హెచ్ సియు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఆదివారం అంతర్జాల వేదిక ద్వారా భవాని సాహిత్య వేదిక, కరీంనగర్ ఆధ్వర్యంలో డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన దాశరథి కవి సమ్మేళనం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. నిజాం పాలకుల చేతిలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోల్పోయి జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్న పరిస్థితుల్లో ఒక ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ, నిజాం పాలనను వ్యతిరేకిస్తూ, అక్షర శరాలు సంధించిన ధిక్కార స్వరం దాశరథి కృష్ణమాచార్యులని ఆచార్య దార్ల వెంకటేశ్వరావు అన్నారు. అటువంటి దాశరథి స్ఫూర్తిని తమ కవితల ద్వారా గుర్తు చేసుకోవడానికి ఇటువంటి కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. దాశరథి పేరుని ఏదైనా ఒక విశ్వవిద్యాలయానికి పేరు పెట్టడం ద్వారా ఆయనకు నిజమైన నివాళిని అందించినట్లు అవుతుందని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ జూలై నెలలో దాశరథి శతజయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించి, వాటిని ఒక గ్రంథ రూపంలో కూడా తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జన్మించిన దాశరథి పేదరికం, కష్టనష్టాలతో తెలంగాణ ప్రజల తరపున అగ్నిధార కురిపించి, రుద్రవీణ పలికించిన మహాంధ్రోదయ కవి అని గౌరవ అతిథిగా పాల్గొన్న గంటా మనోహర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలుగులో అస్తిత్వ ఉద్యమాలు రాకముందే ఆ భావాలకు స్ఫూర్తినిచ్చే గొప్ప అభ్యుదయ కవిగా, నిజాం నవాబుని వ్యతిరేకిస్తూ విప్లవాగ్నినీ, మరొకవైపు శృంగారభావాల్ని పలికించిన ప్రతిభావంతుడైన కవిగా విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు దాశరథిని అభివర్ణించారు. నిజాం నిరంకుశత్వంతో ప్రజల అల్లాడిపోతున్న సమయంలో పోరాట స్ఫూర్తితో తన సాహిత్యం ద్వారా ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన దాశరథి కృష్ణమాచార్యుల పేరుని శాశ్వతంగా నిలిచేటట్లు తెలంగాణాలోని ఒక విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెడితే బాగుంటుందని వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా ఒక తీర్మానాన్ని చేసి ప్రభుత్వానికి నివేదించాలని సభలో పాల్గొన్న వారందరూ అభిప్రాయపడ్డారు. సుమారు 75 మంది వరకు కవులు పాల్గొని వచన, పద్య కవితలలో దాశరథి జీవితాన్నీ, రచనలను పోరాట స్ఫూర్తినీ ప్రతిఫలించేలా వర్ణిస్తూ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. వీరస్వామి గారి 'రారాకృష్ణయ్య' పాటతో ప్రారంభమైన సమ్మేళంలో కరిపే రాజకుమార్, హేమంత్ సింగ్ ఆంజనేయులు సుజాత శోభాదేశ్ పాండే, లింగయ్య అలకుంట్ల, అమర్నాథ్, చంద్రమౌళి, మానస నవీన్, నారాయణమూర్తి, పెద్దాడ సుబ్బారావు, రేవతి, ఉషారాణి తదితర కవులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2500లకు పెంచాలి

- పాకెట్ మనీ రూ.1000 ఇవ్వాలి
- ఎస్ ఎం హెచ్ హాస్టల్లో కేవీపీఎస్ అధ్యయన యాత్ర



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.2500లకు పెంచాలని, విద్యార్థులకు పాకెట్ మనీ రూ.1000 ఇవ్వాలని, మెనూ సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం కళాశాల విద్యార్థుల హాస్టల్లో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థుల సమస్యలపై అధ్యయన యాత్రను ప్రారంభించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ సామేల్, ఎం.ప్రకాష్ కారత్, మండల కార్యదర్శి ఎం. ఆనంద్ తో కలిసి స్కైలాబ్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 160 మంది విద్యార్థులు ఉంటున్న హాస్టల్లో కేవలం 24 గదులు మాత్రమే ఉన్నాయని, ఒక గదిలో ఆరుగురు స్టూడెంట్స్ ఉండటం వల్ల ఇబ్బందిపడాల్సి వస్తుందన్నారు. స్నానాలు, బట్టలు వాష్ చేసుకోవడానికి నీళ్లు సరిపడా రావటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15నెలలుగా భవనం అద్దె చెల్లించడం లేదన్నారు. ఐదు నెలలుగా కరెంటు బిల్లు బకాయి ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు హాస్టల్ భవనాన్ని నిర్మించాలని కోరారు. విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్ ప్రభుత్వం అందించాలన్నారు. హాస్టల్లో ఉదయం పూట పెట్టాల్సిన టిఫిన్ ప్రతిరోజు పప్పుతో కూడిన రైస్ పెడుతున్నారని, కనీసం ఇడ్లీ, వడ, పూరి, దోష వంటి టిఫిన్లకు విద్యార్థులు నోచుకోవట్లేదని చెప్పారు. విద్యార్థులకు పౌరసరఫరాల శాఖ నుంచి సన్న బియ్యమిస్తున్నామని పదేపదే చెబుతున్నారని, కానీ అవి సన్నబియ్యం కాదని బియ్యం పట్టి పరిశీలించి చూశారు. 2016 సంవత్సరం నుంచి కేవలం రూ.1500 రూపాయలు మాత్రమే అందిస్తున్నారని, అవి సరిపోవటం లేదన్నారు. విద్యార్థుల లైబ్రరీలో పోటీ పరీక్షల మెటీరియల్ ఇవ్వాలన్నారు. ఆట వస్తువులు అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం లేకపోవడంతో చదువులపై దాని ప్రభావం పడుతుందన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులు మూడు నెలలకోసారి తనిఖీ చేయాలని, స్థానిక సమస్యలన్నీటిని పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపుదలకు తక్షణమే బడ్జెట్ కేటాయించాలన్నారు. హాస్టళ్లను ప్రభుత్వ వైద్యాధికారులు నెలకోసారి సందర్శించి, విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలని జీవో ఉన్నప్పటికీ అది అమలుకు నోచుకోవటంలేదని డాక్టర్లు రావట్లేదని చెప్పారు. డిఏ హెచ్ హాస్టల్లో వాటర్ సమస్య తీవ్రంగా ఉందని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాటర్ సౌకర్యం లేదన్నారు. గ్రీజర్ సౌకర్యం కల్పించాలని, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించాలని చెప్పారు. హాస్టల్ సర్వేలో విద్యార్థులు మోహన్, జ్ఞానేశ్వర్, అక్షిత్, యుగంధర్, ప్రశాంత్, గౌతమ్, దయాకర్, వినయ్, మహేష్, మోహన్, ప్రవీణ్, దుర్గాప్రసాద్, యాదగిరి, ప్రశాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు



# వేముల నరేష్ అకాల మరణం తీరని లోటు

■ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

**శాలిగౌరారం,విశాలభారతి:** తెలంగాణ ఉద్యమంలో ఆట పాట,దూం ధాం తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసిన ఉద్యమకారుడు, తెలంగాణ సాంస్కృతిక సారధి ఉమ్మడి జిల్లా మాజీ కన్వీనర్ వేముల నరేష్ అకాల తీరని లోటని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ఆదివారం అన్నారు.అనారోగ్యంతో వేముల నరేష్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ లు శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి ఆదివారం నరేష్ నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నరేష్ ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరికి 50 వేల చొప్పున పిక్స్ డు డిపాజిట్ చేస్తానన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నరేష్ రాష్ట్ర వ్యాప్తంగా అలుపెరుగని పోరాటంతో తిరిగి తన పాటలతో ఊర్రుతాలుగించారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అయితగోని వెంకన్న గౌడ్, మామిడి సర్వయ్య,కట్టా వెంకటరెడ్డి,శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వేల్పూర్, విశాల భారతి** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని.. కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏకకాలంలో రుణమాఫీ కార్యక్రమాన్ని చేసిందని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. రైతులకు ఏకకాల రుణమాఫీ చేసినందున పచ్చల నడుకుడ గ్రామంలో ఆదివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుని రైతుల సంక్షేమాన్ని పక్కన పెట్టి రుణమాఫీ చేస్తామని దొంగ మాటలు చెప్పి కొంతమేర మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారని రాష్ట్రాన్ని సర్వ సర్వనాశనం చేసిన గత పార్టీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేక ఎద్దేవా చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎప్పుడు రైతు పక్షపాతి అని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులు రుణమాఫీ కూడా చేయడం ఎంతో ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**పినపాక, విశాలభారతి:** మండలం పరిధిలోని డింపు మెడికల్ స్టోర్స్ పాండురంగాపురం గ్రామంలో కొప్పుల మురళి ఆధ్వర్యంలో గ్రామ యువత ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి చింతల బయ్యారం,వెంకట్రావ్ పేట, మద్దులగూడెం,సింగిరెడ్డిపల్లి మల్లారం,పలు గ్రామాల యువకులందరు కలిసి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కొప్పుల మురళి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం అని ఆపదలో ఉన్న తోటి మనిషికి ప్రాణం పోసే విలువైన సహాయమని,రక్తదానం చేయడం వల్ల శరీరంలో బ్లడ్ సర్కులేషన్ సాఫీగా జరుగుతుందని,కొత్త రక్త కణాల ఉత్పత్తి అవుతుందన్నారు. అలాగే గుండెపోటు నుంచి దూరంగా ఉంచుతుందని,గ్రామాల్లో యువతను ఆదర్శంగా తీసుకొని సమాజ శ్రేయస్సు సేవా రంగంలో సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొప్పుల మురళి,కొప్పుల లక్ష్మణ్,మునిగల సంతోష్,తోట ప్రవీణ్,బొల్లె నరేష్, జంపయ్య ప్రవీణ్, సతీష్,బ్ల్ నాగరాజు, పవన్, శ్రీను, రాజు, కిరణ్, కృష్ణ గ్రామాల్లో యువత తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్

■ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి

**సూర్యాపేట, విశాలభారతి** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నామని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న 44వవార్డు కొత్త బస్టాండ్ వద్ద రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ కాలువను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టానని, ప్రజలకు చేరువగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతున్నదని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ గతంలో నాయకులు ఎన్నికల సమయంలోనే పట్టణాలకు వస్తే దామన్న మాత్రం నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలను అర్హులకు అందించడమే లక్ష్యంగా దామన్న పని చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, కౌన్సిలర్ లు బైరు, శైలేందర్, కుంభం రాజేందర్, ఆనంతుల యాదగిరి,చిరివెళ్ల శభరీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆమనగల్ లయన్స్ క్లబ్ కు అవార్డుల పంట

■ అత్యుత్తమ కార్యదర్శిగా కే గోవర్ధన్ రెడ్డి
■ అత్యుత్తమ పిఆర్ఓగా ఎంఏ పాషా

**కల్వకుర్తి, విశాల భారతి**



లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు అవార్డుల పంట వరించింది. లయన్స్ క్లబ్ జిల్లా 320A 2023 24 సంవత్సరానికి గాను జిల్లా గవర్నర్ హరి నారాయణ బట్టడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్లోని భాటీయ గార్డెన్లో ప్రతిభ అవార్డుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు' 12 అవార్డులను దక్కించుకున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు డిస్టిక్ 320 A లోనే అత్యుత్తమ క్లబ్ గా నిలిచిందన్నారు. బెస్ట్ క్లబ్ గా, బెస్ట్ బ్యానర్ గా అవార్డులను సొంతం చేసుకుంది. వీటితోపాటు లయన్స్ క్లబ్ కార్యదర్శి కే గోవర్ధన్ రెడ్డి అత్యుత్తమ అవార్డును అందుకున్నారు. జోన్ చైర్మన్ లయన్ ఏ శేఖర్ రెడ్డికి అవార్డు మిల్స్ అండ్ విల్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, కడ్తాల్ లో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాలకు ప్రశంస పత్రాలు, అవార్డు దక్కగా కంటి వైద్య శిబిరాలను నిర్వహించిన ఎం చంద్రశేఖర్ కు అవార్డు దక్కింది. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు జిల్లా చైర్మన్లు ఎం అంజయ్య, బండేల రామచంద్ర రెడ్డిలకు సైతం అవార్డులు వరించాయి. మాజి గవర్నర్లు జి చెన్నకేశవరెడ్డికి సన్మానం చేసి అవార్డు అందజేశారు. అదేవిధంగా సందడి నరేందర్ రెడ్డి, మాజీ గవర్నర్ జూలురి రమేష్ బాబు లు అవార్డులు అందుకున్నట్లు క్లబ్ పిఆర్వో పాషా తెలిపారు. జిల్లాలోని అత్యుత్తమ క్లబ్ గా ఎన్నికైనందుకు తమకు సహకరించి, క్లబ్బు సేవా కార్యక్రమాలకు సహకరించిన లయన్ సీనియర్ సభ్యులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి కొరవి వెంకటయ్య, పిఆర్ఓ పాషలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్, మల్టిపుల్ కోఆర్డినేటర్ జి చెన్న కిషన్ రెడ్డి, మల్టిపుల్ ఏరియా లీడర్స్ సందడి నరేందర్ రెడ్డి, క్లబ్ నూతన అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ శేఖర్ రెడ్డి, జిల్లా చైర్మన్ ఓంకారం జూలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణీ స్త్రీలపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ

**వాజేడు, విశాలభారతి:** గోదావరి వరదల కారణంగా ములుగు జిల్లా బాధ్యుడు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి గర్భిణీ స్త్రీలను గుర్తించి అధికారులు ముందస్తుగా సురక్షిత వైద్యశాలలకు తరలిస్తున్నారు. దీనిలో భాగంగా వాజేడు మండల పరిధిలోని పెద్ద గొల్లగూడెం గ్రామానికి చెందిన బొల్లె సంధ్య అనే గర్భిణీ స్త్రీ నాలుగు రోజుల వ్యవధిలో డెలివరీ అవుతుందని తెలుసుకున్న మండల అధికారులు తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీ ఓ శ్రీకాంత్ డిప్యూటీ తాసిల్దార్ రాహుల్ చంద్ర వర్మ ఆర్ ఐ కుమార్ స్వామి గర్భిణీ స్త్రీ కుటుంబానికి అవగాహన కల్పించి, తాసిల్దార్ శ్రీనివాస్ ప్రత్యేక స్వరవతో సొంత వాహనంలో వైద్యశాలకు తరలించారు. అదేవిధంగా ఆగస్టు 15 తారీకు లోపు డెలివరీ డేట్ లో ఉన్న గర్భిణీ స్త్రీలను ప్రత్యేక సురవతో ముందస్తుగా వైద్యశాలకు తరలిస్తున్నట్లువారు పేర్కొన్నారు.



# గోదావరి వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

■ వరద ముంపు గ్రామాలను పరిశీలించిన కలెక్టర్

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలంలో వరద పంపు ప్రాంతాలను ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదివారం పరిశీలించారు. మండల పరిధిలోని పేరూరు చండ్రుపట్ల గ్రామాల మధ్య ఉన్న మర్రివాగు ముంచెత్తిన రహదారిని ఆయన పరిశీలించారు అటువైపు ఎవరు వెళ్లకుండా బార్కెట్లు ఏర్పాటు చేయకపోవడంతో వాజేడు మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారువెంటనే మార్కెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బోగత జలపాతాన్ని సందర్శించిన కలెక్టర్ వర్ద ఉధృతి ఎక్కువ ఉన్నందున కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని పర్యటకులు వరద నీటిలోకి దిగకుండా చర్యలు తీసుకోవాలని డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ కు ఆదేశాలు జారీ చేశారు. వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా బొగత జలపాతం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి మహిళా శక్తి క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పనులు దగ్గరుండి చూసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా గుట్టపై నివసించే పెనుగోలు గిరిజనులకు వాజేడు మండల కేంద్రానికి రప్పించేందుకు వారికీ నివాసం ఏర్పాటు చేసేందుకు ఇంటి స్థలాలను మండల కేంద్రంలోని ఫారెస్ట్ స్థలాన్ని పరిశీలించారు.



# వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**పాలకీడు, విశాలభారతి:** నేరేడుచర్ల మండలంలో జరిగిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షులుగా పంగ బుచ్చిబాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా చందమల్ల చరణ్,కోశాధికారిగా మచ్చ సునీల్, ఉపాధ్యక్షులుగా రాపోలు సురేష్,
సందీప్ వర్మ ని ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సలహా దారులు ఉద్దోజు శ్రీనివాసచారి,మండల గౌరవ అధ్యక్షులు చందమల శ్రీరాములు, మాజీ అధ్యక్షుడు బాలస్వామి, సైదులు, మచ్చ రవి ఇంజమూరి వెంకటేశ్వర్లు, నరసింహచారి, సీనియర్ ఫోటోగ్రాఫర్లు వి గణేష్ మరియు గౌస్ ఆర్కే రాజేష్ సందీప్ మధు శంకర్ కిషోర్ తరుణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.



# జోరుగా వానలు.. ముంచేత్తున్న వరదలు

■ జలమయమైన రహదారులు
■ నిలిచిపోయిన రాకపోకలు
■ అప్రమత్తమైన అధికారులు

**వాజేడు, విశాలభారతి:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షాలు కురుస్తుండడంతో వరదలు ముంచెత్తుతున్నాయి గోదావరి వరదల కారణంగా 163 వ జాతీయ రహదారితో సహా పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. దీనితో అంతరాష్ట్ర రాకపోకలకు అంతరాయం కలగడమే కాక ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం స్తంభించింది అప్రమత్తమైన అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా జోరుగా కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలోకి వరద నీరు అత్యధికంగా చేరడంతో ఉధృతంగా పెరుగుతూ ఉగ్ర గోదావరిగా మారింది. కాలేశ్వరం మేడిగడ్డ సమ్మక్క సారక్క బ్యారేజీలు గేట్లు మొత్తం ఎత్తివేయడంతో ఎగువ ప్రాంతం నుండి అత్యధికంగా వరద నీరు రావడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు వద్ద గోదావరి ఉధృతంగా పెరుగుతూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరుకుంది. గోదావరి మరింతగా పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారు తెలుపుతున్నారు.దీనితో లోతట్టు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒకవైపు ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షాలు కురవడం మరోవైపు గోదావరి వరదలు అంతకంతకు పెరిగిపోవడంతో వరద ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు అధికారులు మరో మూడు రోజులు ములుగు జిల్లాలు జోరుగా వర్షాలు కురుస్తాయి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



# నూతన బోరుబావిని ప్రారంభించిన అన్వేష్ రెడ్డి

**వేల్పూర్, విశాల భారతి** వేల్పూర్ మండలం పచ్చల నడుకుడ గ్రామంలో ఆర్డబ్ల్యూఎస్ నిధుల ద్వారా మంజూరైన బోరుబావిని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ బోరు బావి ద్వారా గ్రామంలోని మంచినీటి సరఫరా పథకానికి కొరత లేకుండా ఉందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం బోరు బావి ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో డ్వాక్రా సంఘం మహిళలు నూతన పదవి చేపట్టినందున అన్వేష్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ది అపరాలు అండ్ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక

**సూర్యాపేట, విశాలభారతి** ది అపరాలు అండ్ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా దేవరశెట్టి రవిశంకర్, కార్యదర్శిగా చల్లా వెంకన్న, కోశాధికరిగా పైడిమర్రి రమేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అసోషియేషన్ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అసోషియేషన్ అభివృద్ధితో పాటు వ్యాపారంలో కలిగే అంతరాయలను, ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందు కృషి



చేస్తానని అసోషియేషన్ నూతన అధ్యక్షులు దేవరశెట్టి రవిశంకర్ తెలియజేశారు.

# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న గుణ్ వీర్ రెడ్డి

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మాజీ మార్కెట్ చైర్మన్ గుణ్ వీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఆయన బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుణ్ వీర్ రెడ్డి గతంలో బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడుగా, భీమ్‌గల్ మండల అధ్యక్షుడుగా, భీమ్‌గల్ మండలం కుప్కల్ గ్రామ సర్పంచ్ గా పదవులు చేశారు. అలాంటి నాయకుడు కాంగ్రెస్ లో చేరడంతో, బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బే. కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా గుణ్ వీర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై, నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్



నాయకత్వంలో ప్రజాసేవ చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాటిపత్రులు పంపిణీ చేసిన ఎన్ఎస్యుఐ యువకులు

**బాల్కొండ, విశాల భారతి:** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో భీమ్‌గల్ మండలం దేవన్ పల్లి (తాళ్లకుంట)లోని గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సారియైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్, బాల్కొండ నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ మొండి దినేష్ ఆధ్వర్యంలో వారి సొంత ఖర్చులతో పేద కుటుంబాలకు తాటి పత్రులు పంపిణీ చేశారు. పేదలను గుర్తించి ఇలాంటి సహాయం చేసిన యువకులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ యువకులు కార్తీక్, రేశ్వంత్,రిషి,రహీల్, అరవింద్, హర్షిత్ పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి రెగ్యులర్ చేయాలి

**సూర్యాపేట, విశాలభారతి** రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులను, కార్మికులను బడ్జెట్ సమావేశాల సమయంలో క్రమబద్దీకరణ చేయాలని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ యం. రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యం. రాంబాబు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్నారని, గత ప్రభుత్వకాలంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పలు మార్లు విజ్ఞప్తులు, అందోళనలు పెడరేషన్ నిర్వహించామని అన్నారు. కాని ప్రభుత్వం వారి సమస్యను పరిష్కారం చేయలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుందని వెయ్యి కండ్లతో ఉద్యోగులు, కార్మికులు ఎదురు చూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాలయాపన చేయకుండా, వారిని రెగ్యులర్ చేయాలని అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యం కావాలని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, శ్రామిక మహిళా కన్వీనర్ సిహెచ్. యాకలక్ష్మి, యం. శేఖర్, సాయికుమార్, నాగరాజు, గిరిబాబు, పద్మ, గీత తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మ ఎదుర్కోలు

**ఆర్మూర్,విశాల భారతి** నందిపేట్ మండలంలోని మాయాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో ముత్యాలను ఎదుర్కొన్నారు. గంగా జలాలను తీసుకువచ్చి దేవత మూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం అడవిలో ఉన్నటువంటి ముత్యాలమ్మను ఎదుర్కొనడానికి తరలి వెళ్లారు. పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నవి. భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలంతా అష్ట ఆరోగ్యలతో పాడిపంటలతో విరజిల్లాలని, ముత్యాలమ్మను గ్రామస్తులు వేడుకున్నారు.

## గురువుల పట్ల భక్తి శ్రద్ధలు కలిగి ఉండాలి

**సూర్యాపేట, విశాలభారతి** ప్రతి మనిషి జీవితంలో విద్య ద్వారా అందరిలో అజ్ఞానమనే చీకటిని తొలగించే వారే గురువని శ్రీ సత్య సాయి ధ్యానమండలి యోగా గురువు గుంటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అపూర్వ దివ్యాంగుల రెసిడెన్షియల్ పాఠశాల నందు గురు పౌర్ణమి సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేసి మాట్లాడారు. తల్లి దండ్రులే ప్రథమ గురువులని వారిని అందరూ కూడా గౌరవించాలని, వారి మాటలను శాసనంగా భావించాలన్నారు. విద్యను అందిస్తున్న గురువుల పట్ల భక్తి శ్రద్ధలు కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాగి శ్రీనివాసచారి, బాలాజీ నాయక్, కొమిరిశెట్టి ఆంజనేయులు, కొలిశెట్టి శ్రీనివాస్, శర్వరాల రాంబాబు,



దేవేంద్ర చారి నాగేంద్ర చారి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.



## పాముకాటుకు యువతి మృతి

**సైదాపూర్, విశాల భారతి** మండలంలోని ఆకునూరు తండా గ్రామంలో పాము కాటుతో బర్మా శిరీష( 21) అనే యువతి మృతి చెందింది. మంగళవారం 9 గంటల సమయంలో పొలంకాడికి పోతుండగా నల్ల త్రాచు పాము శిరీష ఎడమ కాలుకు కాటేసింది. పాము కాటేసింది అని చుట్టుపక్కల ఉన్న రైతులకు తెలుపగా వారు కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు చనిపోయింది. శిరీష మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.




## ఎకో్స్ పోస్టర్ల ఆవిష్కరణ

**చింతపల్లి విశాల భారతి** తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎకో్స్ పోస్టర్లను చింతపల్లి మండల ఎస్సై యాదయ్య ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల్, చింతపల్లి మండలం ఫోటోగ్రాఫర్ అధ్యక్షుడు వెలుగు శ్రీను, ప్రధాన కార్యదర్శి బోడ రాజు, కోశాధికారి నల్ల శంకర్, ఉపాధ్యక్షులు మస్కుగిరి, గౌరవ అధ్యక్షులు నర్సింగ్ కృష్ణ గౌడ్ , సుధాకర్ మరియు జి శ్రీశైలం, మహేష్, రమేష్, నయామ్, శివ, కిరణ్, శ్రీశైలం, విష్ణు, రాము, మండల ఫోటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలి..

■ **జిల్లా కార్యదర్శి చెన్న మోని రాములు**



**చింతపల్లి విశాల భారతి** త్వరలో జరగబోయే స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో నియోజకవర్గంలో గ్రామ గ్రామాన భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేసేందుకు కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమోని రాములు పేర్కొన్నారు. ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక మండల శాఖ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 8 ఎంపీ సీట్లు భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకోవడం జరిగిందని వారు వ్యాఖ్యానించారు. అదే రీతిలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా భారతీయ జనతా పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి స్థానాల్లో కూడా దేవరకొండ నియోజకవర్గం నుండి పోటీ చేసేందుకు ఉత్సాహవంతమైన యువకులు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా, ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అత్యధిక ఓట్లు సంపాదించిన మండలంలోని వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులను జిల్లా కార్యదర్శి చెన్న మోని రాములు, భారతీయ జనతా పార్టీ చింతపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో వారికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి బిజెపి మండల శాఖ అధ్యక్షులు చివర్ల రమేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రా నగేష్ గుప్తా, బిజెపి జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

**చింతపల్లి విశాల భారతి** గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం చింతపల్లి మండలం కేంద్రంలోని శ్రీ సాయి బాబా ఆలయాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సందర్శించి, స్వామి వారిని దర్శించుకొని, వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయి బాబా ఆయలం కోసం విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ట్రాన్స్ ఫార్మర్ ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఎస్సి, ఏడీ, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, చింతపల్లి మండల మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, దేవాలయ కమిటీ చైర్మన్ ధనంజయ,రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు

**తుంగతుర్తి, విశాలభారతి:** గురు పౌర్ణమి పురస్కరించుకొని తుంగతుర్తి మండల పరిధిలోని దేవుని గుట్ట తండా సమీపంలోని శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో భక్తులు ఘనంగా పూజల నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గూగులోతు బాలాజీ ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించారు ఉదయం 5 గంటల నుండి భక్తులు సాయిబాబా ఆలయానికి చేరుకొని ఆవుపాలతో అభిషేకాలను నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజల కోసం తుంగతుర్తి, వెంపటి,రామన్న గూడెం, దేవుని గుట్ట, తండాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బాలాజీ దంపతులు తుంగతుర్తి ఎస్ఐ ఏడుకొండలు ప్రముఖ సాయి బాబా భక్తులు గిరి టైలర్, గడ్డం యాదగిరి,కొదాటి విక్రమ్ రావు దంపతులు, డాక్టర్ ఎస్ వై సంతోష్,బిజెపి మండల అధ్యక్షుడు గాజుల మహేందర్, మాజీ ఎంపిటిసి గాజుల యాదగిరి, మహిళలు భక్తులు పాల్గొన్నారు.



## ముంపు ప్రాంత ప్రజలను అన్ని విధాల ఆదుకోవాలి

■ **కలెక్టర్ ని కలిసిన సిపిఐ బృందం**

**భద్రాచలం, విశాలభారతి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ నాయకత్వం ఆధ్వర్యంలో భద్రాచలం పర్యటనకు విచ్చేసినటువంటి జిల్లా కలెక్టర్ ని పట్టణ సిపిఐ బృందం కలిసి భద్రాచలంలో గత వారం రోజులుగా ఎడతెగకుండా కురుస్తున్నటువంటి వర్షాలకు భద్రాచలం డివిజన్ ప్రజలను వరద ముంపుకు గురికాకుండా అధికారులను అప్రమత్తంగా ఉంచాలని సిపిఐ బృందం జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగింది. అదేవిధంగా గత ప్రభుత్వంలో భద్రాచలం పట్టణంలో ముంపునకు గురి అయినటువంటి కాలనీలో ప్రజలకు పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని ఇంతవరకు అవి అమలుకు నోచుకోలేదని నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా భద్రాచలం ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కోరారు. అదేవిధంగా భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించిన ప్రభుత్వం, అధికారులు వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని కోరారు. వరద నీరు భద్రాచలం పట్టణంలోకి రానీయకుండా సూయిస్ లు లీక్ అవ్వకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో సిపిఐ పట్టణ నాయకులు సాధనపల్లి సతీష్, పితాని మనసే, చిట్టిపోతుల కృష్ణయ్య, కంభం మెట్టు శ్రీనివాస్, కొక్కిరేణి అశోక్ కుమార్, కవ తపు మహేష్ పసుపులేటి నాగు చీదరగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## గురుపౌర్ణమి సందర్భంగా సాయిభోజన్, దుప్పట్ల పంపిణీ

■ **కుర్రేఘూడ్ గ్రామంలో గిరిజనులకు అన్నదానం**

**బెల్లంపల్లి, విశాల భారతి** గురు పౌర్ణమిని పురస్కరించుకుని బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలం కుర్రేఘూఢ్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గిరిజనులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని గిరిజనులు అన్నార్తులు సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు.

**గిరిజనులకు దుప్పట్లు పంపిణీ:**
కాసిపేట మండలంలోని మారుమూల గిరిజన గ్రామం అయిన కుర్రేఘూట్ లో ఉన్న గిరిజనులకు ప్రస్తుత వర్షాకాలం, రానున్న చలికాలం నేపథ్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఈ మేరకు చొరవ తీసుకొని దాతల సహకారంతో దుప్పట్లు కొనుగోలు చేసి ఇక్కడి గిరిజనులకు పంచిపెట్టారు. సాయినాథుని ఆశీర్వచన.. బాయిజమ్మ ఆలోచన, ట్రస్ట్ వారి ఆచరణ, ప్రపంచానికి ప్రేమ తత్వాన్ని, సేవా మార్గాన్ని బోధించిన సాయినాధుని ఆశీర్వాదంతో.. ఆకలితో అలమటించే సాటివారి కడుపు నింపాలనే బాయిజమ్మ ఆలోచనతో వారి మార్గంలో నడుస్తూ సేవా కార్యక్రమాలను ఆచరిస్తున్నట్లు బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని కోరారు. ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు జేరిపోతుల చంద్రకళ డి మధుకర్, నల్ల అంబిక శ్రీనివాస్ , గోనె మంజుల శ్రీనివాస్, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

■ **ఎమ్మెల్యే బాలు నాయక్**

**చింతపల్లి, విశాల భారతి** దేవరకొండ నియోజకవర్గంలో వివిధ మండలాల్లోని గ్రామాలలో అనారోగ్యాలకు, రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో పలు విషయాలపై ముచ్చటించారు. ఏ ఒక్కరికి ఆపద వచ్చినా తాను అన్ని విధాలుగా ముందుండి ప్రభుత్వం నుంచి అందించే సిఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ ను మంజూరు చేపిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, నసర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి రాజు, తేదీడు గ్రామ శాఖ అధ్యక్షులు, శివ శంకర్ యాదవ్, వివిధ గ్రామాల సి ఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ బాధితులు తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ విలేకరులు అరెస్ట్

**కొత్తగూడెం, విశాలభారతి :** కొత్తగూడెం సన్యాసిబస్తిలో దాసరి సాంబశివరావు కు దూరపు బంధువు అయిన దాసరి పూర్ణ అను ఒక ఆడ మనిషిని అక్రమ సంబంధం పెట్టుకున్నదనే అనుమానంతో తన భర్త కొట్టి చంపినాడు.ఆ విషయంలో వారి కుటుంబ సభ్యులను అక్రమ సంబంధం వలన మర్డర్ చేసారని పేపర్ లో ప్రచురిస్తామని బెదిరించి వారి దగ్గర ఎలాగైనా డబ్బులు తీసుకోవాలని ఐదుగురు వ్యక్తులు ఆ కుటుంబ సభ్యులపై బెదిరింపులకు పాలపడ్డారని వన్ టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు.మృతురాలి కుమారుడైన కార్తిక్ కు శ్రీనివాస్ అను వ్యక్తి ఫోన్ చేసి రిపోర్టర్ అని చెప్పి మీ తల్లి అక్రమ సంబంధాలు పెట్టుకున్నది అందుకే మీ నాన్న మీ తల్లిని చంపాడని,పేపర్లో ఆ విషయాన్ని రాయకుండా ఉండాలంటే మాకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బెదిరించాడని వివరాలు తెలిపారు.ఆ తరువాత మళ్ళీ ఫోన్ చేసి మా మనుషులు మీ ఇంటికి వచ్చి మిగిలిన విషయాలు మాట్లాడుతారు అని చెప్పి ఫోన్ పెట్టేసినాడు.అదే రోజు రాత్రి సుమారు 9 గంటలకు దాసరి కార్తీక్ ఇంటి దగ్గరకు శ్రీనివాస్ మరియు దాసరి సాంబశివరావు మరియు మరో ముగ్గురు వ్యక్తులు అయిన రమేష్,రాజేష్,గణేష్ లు వెళ్లి పత్రికా విలేకరులమని చెప్పి బెదిరించి డబ్బుల కోసం బెదిరించారని విచారణలో తేలిందన్నారు.కానీ అతను డబ్బులు ఇవ్వకపోవడం వల్ల వారు తిరిగి వచ్చేసినారు అని తెలిపారు. అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరి రాజేష్, దాసరి సాంబశివరావు, గుంటూరు శ్రీనివాసరావు, మేకల రమేష్, బాధావత్ గణేష్ వీరు అయిదుగురుపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**బాల్కొండ, విశాలభారతి:** ఉత్తర ముఖ శివాలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. భీమ్‌గల్ మండలంలోని గ్రామాలలో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువుల పూజోత్సవ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. బాబానగర్ లో ఉత్తర ముఖ శివాలయం శ్రీ శ్రీ గంగానంద్ మహారాజ్ ఆశ్రమంలో ఉదయం నుండి వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకొని పూజ, యజ్ఞం కార్యక్రమాలను నిర్వహించి, అనంతరం గురువులకు పాదాపూజా జరిపి,భక్తి గితాలు ఆలపించారు. అనంతరం ఆశ్రమంలో భక్తుల సౌకర్యార్థం మేరకు అన్న ప్రసాదాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు దేవుడు రాజన్న, యమున, ఆలయ కమిటీ సభ్యులు తోట రాజ గంగారాం,రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది పాత్ర కోసం పూర్తిగా మారిపోతున్న చరణ్



పాత్రను బట్టి ఆ పాత్ర కోసం బాడీలాంగ్వేజ్‌ను, గెటప్‌ను, శరీరాకృతిని మార్చుతుంటారు మన కథానాయకులు. రంగస్థలంలో బుచ్చిబాబు పాత్ర కోసం గడ్డం పెంచిన కథానాయకుడు రామ్‌చరణ్ ఇప్పుడు తాజా చిత్రం పెద్ది కోసం కోర మీసాలు పెంచి.. సరికొత్తగా కనిపించబోతున్నారు రామ్‌చరణ్. రామ్‌చరణ్‌బుచ్చిబాబు కలయికలో రూపొందనున్నతాజా చిత్రానికి పెద్ది అనే టైటిల్‌ను పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. రెండు నెలల క్రితం పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ప్రీ ప్రొడక్షన్ వర్క్ ను జరుపుకుంటున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను సెప్టెంబరులో ప్రారంభిస్తారని తెలిసింది. అయితే ప్రస్తుతం పెద్ది చిత్రంలో రామ్‌చరణ్ కనిపించబోతున్న న్యూ అవతార్‌పైనే కొన్ని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రం కోసం రామ్‌చరణ్ సిక్స్‌ప్యాక్‌తో పాటు పెద్ద మీసాలు, కొరమీసాలతో కనిపించనున్నాడట. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న గేమ్‌చేంజర్ షూటింగ్‌లో పాల్గొంటున్నారు చరణ్. ఈ చిత్రీకరణ పూర్తవగానే పెద్ది చిత్రం గెటప్‌లోకి రావడానికి ఆయన రెండు నెలలు సమయం తీసుకోబోతున్నాడు. ఇందుకోసం ప్రత్యేక కోచ్‌ను కూడా చరణ్ తీసుకున్నాడట.అయితే పూర్తిగా గేమ్‌చేంజర్ షూటింగ్ పూర్తయిందని శంకర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే బుచ్చిబాబు సినిమ కోసం సిద్ధం కావాలనే ఆలోచనలో వున్నాడట ఈ కొణిదెల వారసుడు. ఉప్పెన తరువాత దాదాపు నాలుగు సంవత్సరాల గ్యాప్ తరువాత బుచ్చిబాబు దర్శకత్వలో రానున్న రెండో సినిమా ఇది. ఈ చిత్రంలో చరణ్ పాత్ర ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేయని విధంగా డిఫరెంట్‌గా డిజైన్ చేశాడట బుచ్చిబాబు. స్వర్గీయ కథానాయిక శ్రీదేవి కూతురు జాహ్నవి కపూర్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రం క్రీడా నేపథ్యంలో కొనసాగే పీరియాడికల్ డ్రామా అని సమాచారం. ఆస్కార్ విజేతే ఏఆర్ రెహమాన్ సంగీత స్వరాలు అందిస్తున్న ఈ చిత్రానికి ప్రఖ్యాత కెమెరామెన్ రత్నవేలు ఫోటోగ్రఫీని అందిస్తున్నాడు. అత్యంత భారీ బడ్జెట్ తో వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ , సుకుమార్ రైటింగ్స్‌లతో కలిసి కిలారు సతీష్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.



# సింగపూర్ యూనివర్సిటీలో మాస్టర్స్ పట్టా పొందిన అనా కొణిదెల

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి సతీమణి శ్రీమతి అనా కొణిదెల గారు సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. శ్రీమతి అనా గారికి ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ లో వైభవంగా నిర్వహించిన స్నాతకోత్సవంలో పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానం (ఆర్ట్స్ మరియు సోషల్ సైన్సెస్) లో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. మాస్టర్స్ పట్టా పొందినందుకు సతీమణికి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అభినందనలు తెలిపారు. శ్రీమతి అనా కొణిదెల గారు రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్శిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్ లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికిగాను తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్శిటీలో ఉండగానే మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో శ్రీమతి అనా గారు మొదటి మాస్టర్స్ డిగ్రీ సాధించారు.

# ఆగష్టు 15 'మిస్టర్ బచ్చన్'



మాస్ మహారాజా రవితేజ, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ మాస్ బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మిస్టర్ బచ్చన్' ప్రేక్షకులని అల్టిమేట్ ఎంటర్ టైన్మెంట్ అందించడానికి రెడీగా ఉంది. ఆగస్ట్ 15 ఇండిపెండెన్స్ డే రోజున ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఆగస్ట్ 19న (సోమవారం) రక్షా బంధన్ హాలీడేతో 5 రోజుల లాంగ్ వీకెండ్‌ను ఉపయోగించుకుంటుంది. ఈ సినిమా ప్రీమియర్ షోలు ఆగస్ట్ 14న జరగనున్నాయి. రవితేజ స్లిక్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తున్న రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకోవడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నందున రెగ్యులర్ అప్ డేట్స్ తో వచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మేకర్స్ ఇటీవల ఫస్ట్ సింగిల్ సితార్‌ను విడుదల చేసారు. ఈ పాట క్లాసికల్, లవ్లీ కంపోజిషన్, బ్యూటీఫుల్ లోకేషన్స్, రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ మధ్య స్టీమీ రొమాన్స్ తో విశేషంగా అలరించి చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. సుబ్రమణ్యం ఫర్ సేల్, గద్దలకొండ గణేష్ తర్వాత మిక్కీ జె మేయర్ మిస్టర్ బచ్చన్ కోసం హరీష్ శంకర్‌తో మళ్లీ జతకట్టారు.



# నేను రెడీ

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత మళ్లీ సినిమాల్లోకి ఎంట్రీకి రెడీ అవుతోంది. అనారోగ్యం కారణంగా గత కొంతకాలం నుంచి నటనకు దూరంగా ఉంటున్న సామ్ త్వరలోనే మళ్లీ సినిమాలకు ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది నుంచి షూటింగ్‌లో పాల్గొనబోతున్నానని, దాని కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పుకొచ్చింది. అందులోని పాత్ర కోసం ఇప్పటికే మార్షల్ ఆర్ట్స్ , హార్స్ రైడింగ్, అర్చరీ వంటివి నేర్చుకుంటున్నానని చెప్పింది. తాను ఇండస్ట్రీకి వచ్చి 15 సంవత్సరాలు అవుతుందని, ఈ 15 ఏళ్లలో చాలా ఒడిదుడుకులు అనుభవించానని తెలిపింది. సినిమాల విషయానికి వస్తే సిటాడెల్ అనే వెబ్ సిరీస్‌లో ప్రస్తుతం నటిస్తుంది. ఈ చిత్రం అనంతరం మలయాళంలో మెగాస్టార్ మమ్ముట్టితో ఒక సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు గౌతమ్ వాస్‌దేవ్ మీనన్ దర్శకత్వం వహించబోతున్నాడు. మరోవైపు ఈ సినిమాతో పాటు 'మా ఇంటి బంగారం' సినిమాను అనౌన్స్ చేసింది. తన సొంత ప్రొడక్షన్లో సమంత ఈ సినిమా తెరకెక్కనుంది.



# "35-చిన్న కథ కాదు" స్పెషల్ గ్లింప్స్



నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్."35-చిన్న కథ కాదు. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్ డైరెక్టర్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ విశ్వదేవ్ ను ప్రసాద్ గా పరిచయం చేస్తూ ఒక స్పెషల్ గ్లింప్స్ ని రిలీజ్ చేశారు. విశ్వదేవ్ ను కేరింగ్ అండ్ రెస్పాన్స్‌బుల్ మిడిల్ క్లాస్ ఫాదర్ గా ప్రజెంట్ చేసిన ఈ గ్లింప్స్ చాలా ఇంట్రస్టింగా వుంది. విశ్వదేవ్ రియలిస్టిక్ పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంది. క్యారెక్టర్ ఎసెన్స్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసిన గ్లింప్స్ చాలా క్యురియాసిటీని పెంచింది.

# ఆగస్ట్ 2న 'బృంద' సోనీ లివ్‌లో స్ట్రీమింగ్



అమ్మాయిలు పురుషాధిక్య ప్రపంచంలో రాణించటం కష్టం. అయితే కొందరు మాత్రం అలాంటి కష్టనష్టాలకోర్చి తమదైన ముద్రను వేస్తుంటారు. అలాంటి అరుదైన అమ్మాయే బృంద. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సైగా చేరిన బృంద సమస్యలను చేదించటానికి ప్రయత్నిస్తుంది. అయితే అవి గిట్టని పైఅధికారులు ఆమెను సూటి పోటీ మాటలతో బాధ పెడుతుంటారు. అనుకోకుండా ఓ కేసు విషయంలో ఆమెను సస్పెండ్ కూడా చేస్తారు. అసలు బృందను డ్యూటీ నుంచి ఎందుకు సస్పెండ్ చేశారు.. ఆమెకు ఎదరైన సవాలేంటి? అనే విషయం తెలియాలంటే 'బృంద' అనే తెలుగు వెబ్ సిరీస్ చూడాల్సిందే. సౌత్ క్వీన్‌గా అందరూ అభిమానంతో పిలుచుకునే స్టార్ హీరోయిన్ త్రిష మొట్ట మొదటిసారి ఓటీటీ రంగంలోకి అడుగు పెట్టారు. అది కూడా తెలుగు వెబ్ సిరీస్ కావటం విశేషం. సోనీ లివ్‌లో ఆగస్టు 2న బృంద వెబ్‌సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగులో రూపొందిన ఈ సిరీస్ తమిళ్, కన్నడ, మలయాళం, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లోనూ ఆకట్టుకోనుంది. తొమ్మిదేళ్ల నుంచి ఏమైయ్యారు మీరంతా.. నేను లేకుండా ఈ కేసుని మీరు సాల్వ్ చేస్తామనుకుంటున్నారా! చెయ్యండి.. చెయ్యండి చూద్దాం...అని బృంద తన తోటి అధికారితో కోపంగా అంటుంది. దీంతో ప్రారంభమైన బృంద ట్రైలర్‌లో ఆమె పనిచేసే చోట ఎదుర్కొనే అవమానాలను, సూటిపోటి మాటలను సన్నివేశాల రూపంలో చక్కగా చూపించారు. మరో కోణంలో ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో చీకటి పడిన తర్వాత జరిగే నర బలలు గురించి కూడా చూపించారు. మరో సన్నివేశంలో యాభై మందికి పైగా చనిపోయారని పోలీస్ అధికారులు మాట్లాడుకుంటూ తమ డిపార్ట్‌మెంట్‌కే అది బ్లాక్ మార్క్ అయ్యిందని అంటుంటారు.

# ఆ క్రేజీస్టార్ భార్యగా అంజలి..?

సీనియర్ హీరోల సరసన ఆడిపాడుతూనే, యువ కథానాయకులతో కూడా జోడీ కట్టే అవకాశం చాలా తక్కువ మందికి వస్తుంది. ఇప్పుడు అలాంటి కోవలోనే వస్తారు అచ్చ తెలుగమ్మాయి హీరోయిన్ అంజలి. ఒకప్పుడు వరుస సినిమాలు చేసిన ఈ అందాలతారకు ఇప్పుడు అవకాశాలు అంతంత మాత్రమే అని చెప్పాలి. ఇటీవల అంజలి నటించిన గీతాంజలి 2 భారీ పరాజయాన్ని నమోదు చేసుకుంది. అయితే ఇప్పుడు ఆమె తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. రామ్‌చరణ్ నటిస్తున్నతాజా చిత్రం గేమ్‌చేంజర్. శంకర్ దర్శకత్వంలో లాంగెస్ట్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇంకా చిత్రీకరణ దశలోనే వుంది. రిలీజ్ డేట్ కూడా కన్‌పర్మ్ కాలేదు. అయితే ఈ చిత్రంలో హీరో రామ్‌చరణ్‌కు అంజలి భార్యగా నటిస్తుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రామ్‌చరణ్, అంజలికి సంబంధించిన కొన్ని ఫోటోలు కూడా బయటికొచ్చాయి. అయితే సినిమాలో కథకు అనుగుణంగా వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఏపిసోడ్‌లో అంజలి పాత్ర కీలకంగా చరణ్‌కు భార్యగా వుంటుందని అంటున్నారు. ఈ పాత్ర గురించి అంజలి ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ తన పాత్ర సినిమాలో కీలకంగా వుంటుందని చెప్పగలను. అంతే తప్ప నా క్యారెక్టర్ ఇప్పుడు రివీల్ చేయలేను అని చెప్పారు. సినిమాలో తన పాత్ర చూసి ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారని మాత్రం చెప్పగలను అన్నారట. ఇటీవల విశ్వక్‌సేన్ నటించిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రంలో విశ్వక్‌సేన్‌తో రొమాన్స్ చేశారు అంజలి. ఇప్పుడు చరణ్‌తో జోడి కట్టింది. అయితే గేమ్‌చేంజర్ తప్పకుండా తనను మళ్లీ బిజీ చేస్తుందనే అంచనాలతో వుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నాడు.



# మెకానిక్ రాకీ నుంచి శ్రద్ధా శ్రీనాథ్ ఫస్ట్ లుక్

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో విశ్వక్ సేన్ తన అప్ కమింగ్ మూవీ 'మెకానిక్ రాకీ'తో దీపావళి రేసులో ఉన్నారని ఇటీవల మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 31న విడుదల కానుంది. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి రైటింగ్, డైరెక్షన్ వహిస్తున్న ఈ చిత్రాన్ని SRT ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మించారు. ట్రై యాంగిల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. మెకానిక్ రాకీ ఎక్సయిటింగ్ రైడ్‌కు శ్రద్ధా శ్రీనాథ్ ని స్వాగతిస్తూ, మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. స్లిట్ మ్యాక్సీ డ్రెస్‌లో శ్రద్ధా శ్రీనాథ్ అల్ట్రా మోడిష్‌గా కనిపిస్తోంది. చర్మిస్మాటిక్ స్మైల్ తో కనిపించిన ఫస్ట్ లుక్ చాలా ఎట్రాక్టివ్ గా వుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.